RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 25 అక్టోబర్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:126

# ప్రజాబలం వార్తకు స్పందన

**కదిలిన అధికార యంత్రాంగం.**

**చెత్తపై సమరశంఖం పూరించిన అధికార యంత్రాంగం,ప్రజాప్రతినిధులు.**









RNI N0. TELTEL/2005/16755

ప్రజాబలం

తెలుగు దినపత్రిక

24 Oct 2026 - Page 3

## కేటీఆర్ ఇలాకాలో చెత్త పాలన..

## సిరిసిల్ల ప్రజల ప్రాణాలతో చెలగాటం!

**నియోజకవర్గాన్ని గాలికొదిలేసిన ఎమ్మెల్యే..**

**రోడ్లపై నరకం చూస్తున్న ప్రజలు**

**అవార్డులన్నీ ప్రచారానికేనా?**

**గల్లీల్లో కంపు కొడుతున్న 'స్వచ్ఛ' సిరిసిల్ల**

**కమిషనర్ జాడలేదు, చైర్ పర్సన్, కౌన్సిలర్లు పట్టించుకోరు..**

**మొద్దునిద్రలో మున్సిపల్ యంత్రాంగం!**

రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 23,( ప్రజాబలం ప్రతినిధి )రాష్ట్రంలోనే వీఐపీ నియోజకవర్గంగా చెప్పుకునే సిరిసిల్ల పరువు నడిరోడ్డుపై పేరుకుపోయిన చెత్తకుప్పల సాక్షిగా గంగలో కలుస్తోంది. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ ఇలాకాలో పారిశుధ్య నిర్వహణ పూర్తిగా అటకెక్కింది. మాటల్లో చెప్పే 'హైటెక్ సిరిసిల్ల', కాగితాలపై రాసుకునే 'స్వచ్ఛ సర్వేక్షన్' అవార్డులు కేవలం ప్రచారార్భాటానికే పరిమితమయ్యాయా అన్న ప్రశ్నలు కాలనీలలో వెల్లువెత్తుతున్నాయి.

ఎమ్మెల్యే ఉన్నారా.. నియోజకవర్గాన్ని వదిలేశారా?

గెలిపించిన ప్రజల సమస్యలను పట్టించుకోవాల్సిన ఎమ్మెల్యే అసలు సిరిసిల్లలో ఉన్నారా లేరా అన్నది అర్థం కాని పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో పర్యటించి ప్రజల బాధలు తీర్చాల్సిన బాధ్యతను గాలికొదిలేశారన్న ఆగ్రహం ప్రజల్లో వ్యక్తమవుతోంది. అటు మున్సిపల్ కమిషనర్, పాలకవర్గ చైర్ పర్సన్ , వార్డు కౌన్సిలర్లు కనీసం తమ ప్రాంతాలను పరిశీలించకపోవడంతో వీధులన్నీ డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి.

రోగాల కుంపటిగా మారిన కాలనీలు

రోజుల తరబడి మున్సిపల్ అధికారులు పారిశుధ్య వాహనాలను పంపకపోవడంతో రోడ్ల పక్కనే మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలు, కుళ్ళిన చెత్త పేరుకుపోయి ముక్కుపుటాలు అదిరిపోయే దుర్వాసన వెదజల్లుతోంది. వీధి కుక్కలు వ్యర్థాలను రోడ్డంతా లాగి పారేస్తుండటంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారుణ పరిస్థితుల వల్ల డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక విషజ్వరాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని. ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి వెంటనే యుద్ధప్రాతిపదికన కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తరలించి, బ్లీచింగ్ చల్లించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 24,( ప్రజాబలం ప్రతినిధి )**సిరిసిల్ల పురపాలక పరిధిలోని పలు కాలనీల్లో రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం, పారిశుధ్య లోపం, తీవ్ర దుర్వాసనతో ప్రజలు పడుతున్న నరకయాతనపై 'ప్రజాబలం' దినపత్రికలో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి మున్సిపల్ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు వేగంగా స్పందించారు.

పత్రిక కథనంతో ఉలిక్కిపడ్డ యంత్రాంగం

గత సంచికలో "కేటీఆర్ ఇలాకాలో చెత్త పాలన.. సిరిసిల్ల ప్రజల ప్రాణాలతో చెలగాటం!" అనే శీర్షికతో ప్రజల సమస్యలను ఎండగడుతూ ప్రచురితమైన కథనంపై స్థానిక పాలకవర్గం వెంటనే చర్యలకు ఉపక్రమించింది. నిద్రమత్తులో ఉన్న యంత్రాంగం ఒక్కసారిగా కదిలి క్షేత్రస్థాయికి చేరుకుంది.

రోడ్డెక్కి పర్యవేక్షించిన పాలకవర్గం

"నా ఊరు – నా బాధ్యత" అంటూ మున్సిపల్ పాలకవర్గం, అధికారులు నేరుగా రంగంలోకి దిగారు. మున్సిపల్ చైర్ పర్సన్ , వైస్ చైర్మన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు సంయుక్తంగా పట్టణంలోని పలు వార్డుల్లో స్వయంగా పర్యటించారు. కాలనీల్లో గుట్టలుగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, మురుగు చెత్తను యుద్ధప్రాతిపదికన తొలగించేందుకు జేసీబీలు, ట్రాక్టర్లు, పారిశుధ్య కార్మికులను మోహరించి దగ్గరుండి పనులను పూర్తి చేయించారు. పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు.

'ప్రజాబలం' పత్రికకు కాలనీవాసుల కృతజ్ఞతలు

తమ ప్రాంతాల్లో నెలకొన్న దీర్ఘకాలిక పారిశుధ్య సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారమయ్యేలా చొరవ చూపిన "ప్రజాబలం" దినపత్రికకు స్థానిక ప్రజలు, కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పరిష్కారానికి కృషి చేస్తున్న పత్రిక పాత్రను ప్రజలు ఈ సందర్భంగా కొనియాడారు.

## రూ.150 కోట్లతో మూడు మండలాల్లో శాశ్వత కరువు నివారణ చర్యలు

**ప్రతి గ్రామంలో గ్రామసభ నిర్వహించి ప్రజల అభిప్రాయాల మేరకు ప్రణాళికలు రూపొందించాలి**

**స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రాజెక్టు అమలు**

**ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి**

**మహిళలు, యువత, కులవృత్తులు.. ప్రతి వర్గం అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్:– కరువు పరిస్థితులు ఎప్పుడు తలెత్తినా ప్రజలు, రైతులు తట్టుకునేలా రాష్ట్రంలోని మూడు మండలాల్లో 150 కోట్ల రూపాయిలతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మిగతా 2 లో



## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తాం

**న్యాయపరమైన చిక్కులు లేకుండా నివాసయోగ్యమైన ప్రాంతంలో స్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ**

**జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

వార్తా 4 లో

## Raksha Expo-2026 Curtain Raiser కార్యక్రమంలో ముఖ్యమంత్రి



వార్తా 4 లో

## అమిత్ షా, సీఎం రేఖా గుప్తా శాంతిభద్రతలపై సమీక్ష

ఢిల్లీ, అక్టోబర్ 24: దేశ రాజధానిలో శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం ఢిల్లీ పోలీసు ప్రధాన కార్యాలయాన్ని (హెడ్‌క్వార్టర్స్) సందర్శించి సీనియర్ పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఆయనతో పాటు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా కూడా ఈ భేటీలో పాల్గొన్నారు.

ఎన్నికల సంఘంపై నిరసనలు: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియకు వ్యతిరేకంగా విపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు చేపడుతున్న ఆందోళనల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ (CEC) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.



నవంబర్ 1 రామ్‌లీలా మైదాన్ మెగా ర్యాలీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ, 'ఇండియా' (INDIA) కూటమి భాగస్వామ్య పార్టీలు నవంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో భారీ బహిరంగ ప్రదర్శనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో దేశ రాజధానిలో భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణపై ఈ భేటీలో అమిత్ షా, సీఎం రేఖా గుప్తా పోలీసు అధికారులతో చర్చలు జరిపారు.

ప్రజాబలం

25 అక్టోబర్ 2026 ఆదివారం

# జలసంరక్షణే శ్రీరామరక్ష

నీటిబొట్టును నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఎడారే.. ప్రజల బాధ్యతతో పాటు ప్రభుత్వాల చిత్తశుద్ధి అవసరం! ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పు లు తీవ్ర సవాళ్లను విసురుతున్నాయి. ఇందులో ప్రధానంగా భారత్ లాంటి వ్యవసాయ ఆధారిత దేశాలను వణికిస్తున్న అతిపెద్ద సమస్య 'ఎల్‌నినో'. పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ పరిస్థితి.. మన దేశంలో రుతుపవనాల గమనాన్ని దెబ్బతీసి, తీవ్ర కరవు పరిస్థితులకు, అకాల వర్షాలకు కారణమవుతోంది. దీనివల్ల తాగునీటి ఎద్దడి, సాగునీటి కొరత, ఆహార సంక్షోభం, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉంది. ఈ విపత్తును ఎదుర్కోవడానికి కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా.. ప్రభుత్వ యంత్రాంగం, సామాన్య ప్రజలు సంయుక్తంగా బాధ్యత వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు ఆకాశం నుంచి కురిసిన వర్షపు నీరు వృథాగా సముద్రంలో కలుస్తోంది.. మరోవైపు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీటి కోసం ప్రజలు ఎదురుచూడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఒకప్పుడు నీటితో కళకళలాడిన చెరువులు నేడు కబ్జాలకు గురవుతున్నాయి. భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బోర్లు ఎండిపోతున్నాయి. అయినా మన నీటి వినియోగపు అలవాట్లలో ఆశించిన మార్పు రావడం లేదు. ఈ పరిస్థితి ప్రకృతి వైపరీత్యం మాత్రమే కాదు.. మన నిర్లక్ష్యానికి కూడా అద్దం పడుతోంది. నీటి సంక్షోభం ముంచుకొచ్చిన తర్వాత పరిష్కారాల కోసం పరుగులు తీయడం కంటే, నీటి కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే నిజమైన అభివృద్ధి. తగ్గుతున్న జలవనరులు.. పెరుగుతున్న ముప్పు జలం లేనిదే జీవం లేదు. వ్యవసాయం, పరిశ్రమలు, ప్రజారోగ్యం, పర్యావరణం.. ఇలా ప్రతి రంగానికీ నీరే ఆధారం. కానీ పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, భూగర్భజలాల అధిక వినియోగం, చెరువులు కుంటల ఆక్రమణలు, వర్షపు నీటి సంరక్షణలో నిర్లక్ష్యం జలవనరులపై తీవ్ర ఒత్తిడిని పెంచుతున్నాయి. పట్టణాల్లో కాంక్రీటు నిర్మాణాలు విస్తరించడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గుతున్నాయి. గ్రామాల్లో సంప్రదాయ జలవనరుల నిర్వహణ బలహీనపడుతున్న ప్రాంతాల్లోనూ నీటి లభ్యత సమస్యగా మారుతోంది. వర్షాలు పడినప్పుడు నీటిని నిల్వ చేసుకోలేకపోవడం, ఎండాకాలంలో నీటి కోసం ఇబ్బందులు పడటం మన జల నిర్వహణలోని లోపాలను స్పష్టం చేస్తున్నాయి. భూమిలోకి చేరుతున్న నీటికంటే బోర్లద్వారా తోడుతున్న నీరు ఎక్కువైతే భూగర్భజలాల మట్టం తగ్గిపోవడం తప్పదు. దీని ప్రభావం తాగునీటి సరఫరాపైనే కాకుండా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల ఆదాయం, కుటుంబాల ఆర్థిక పరిస్థితిపైనా పడుతుంది. ప్రతి ఇంటి నుంచే మార్పు మొదలవ్వాలి. నీటి సమస్యను ప్రభుత్వం మాత్రమే పరిష్కరించలేదని, ప్రజలు మాత్రమే పరిష్కరించలేరని గుర్తించాలి. ఇరువురి భాగస్వామ్యం తప్పనిసరి. వర్షాకాలంలో ఇంటి పైకప్పుపై పడే వర్షపు నీటిని సేకరించి భూమిలోకి ఇంకేలా చేయడానికి ఇంకుడు గుంతలు, వర్షపు నీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. నీటి సంరక్షణ అంటే నీటిని తక్కువగా వినియోగించడం మాత్రమే కాదు.. వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాలను పెంచడం, అందుబాటులో ఉన్న నీటిని సమర్థంగా ఉపయోగించడం కూడా. ప్రభుత్వాల బాధ్యత మరింత కీలకం. జలసంరక్షణలో ప్రభుత్వాలు మాటలకే పరిమితం కాకుండా ఫలితాలు కనిపించే చర్యలు చేపట్టాలి. ముందుగా గ్రామాలు, పట్టణాల్లోని చెరువులు, కుంటలు, కాలువలు, ఇతర సహజ జలవనరులపై సమగ్ర సర్వే నిర్వహించాలి. ఆక్రమణలను చట్టబద్ధమైన ప్రక్రియ ద్వారా తొలగించి, నీరు చేరే మార్గాలను పునరుద్ధరించాలి. అవసరమైన చోట పూడికతీత చేపట్టి, చెరువుల నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. వర్షపు నీరు సహజంగా ప్రవహించే మార్గాలు మూసుకుపోకుండా చర్యలు తీసుకోవాలి. కొత్త భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు అయ్యేలా చూడాలి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల్లో ఈ వ్యవస్థల నిర్వహణను పర్యవేక్షించాలి. ఇంకుడు గుంతలు నిర్మించడం వరకే కాకుండా అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలించాలి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలోని నీటి లభ్యత, వినియోగం, వృథా, భూగర్భజలాల పరిస్థితిని అంచనా వేసి స్థానిక జల ప్రణాళికలు రూపొందించాలి. తాగునీటి పైపుల లీకేజీలను త్వరగా సరిచేయాలి. నీటి సరఫరాలో జరిగే నష్టాలను తగ్గించాలి. నీటి నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించి ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలి. వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని మెరుగుపరచడం అత్యవసరం. రైతులకు బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి సూక్ష్మ సేద్య పద్ధతులపై అవగాహన కల్పించాలి. నేల స్వభావం, వర్షపాతం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా శాస్త్రీయ సలహాలు అందించాలి. అవసరానికి మించి నీటిని పెట్టకుండా పంట అవసరాన్ని బట్టి సాగునీటిని అందించే పద్ధతులను ప్రోత్సహించాలి. చెరువులు, కుంటలు, చిన్న నీటి నిల్వ కేంద్రాలను పునరుద్ధరించి వర్షపు నీటిని వ్యవసాయానికి ఉపయోగపడేలా చేయాలి. రైతులకు సాంకేతిక సహాయం, శిక్షణ, సూక్ష్మ సేద్య పరికరాలకు తగిన ప్రోత్సాహకాలు అందించాలి. మరిన్ని కనుగొనండి వార్తాపత్రిక యాక్సెస్ ప్రాంతీయ వార్తలు సేవ రాష్ట్ర వార్తలు సేవ మురుగునీటిని శుద్ధి చేసి, తాగునీరు అవసరం లేని పారిశ్రామిక, ఇతర పనులకు ఉపయోగించే వ్యవస్థలను పట్టణాల్లో బలోపేతం చేయాలి. జలసంరక్షణకు జవాబుదారీతనం అవసరం ప్రభుత్వాలు పథకాలు ప్రకటించడం, నిధులు కేటాయించడం మాత్రమే సరిపోదు. వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలి. స్థానిక ప్రజలు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థలను పర్యవేక్షణలో భాగస్వాములను చేయాలి. ఈ రోజు మనం కాపాడే ప్రతి నీటి బొట్టు రేపటి తరాల జీవనానికి భరోసా కావాలి. నీటి కోసం భవిష్యత్తులో యుద్ధాలు చేయాల్సిన పరిస్థితి రాకుండా ఉండాలంటే, ఈ రోజే జలసంరక్షణకు నడుం బిగించాలి. ప్రభుత్వాలు బాధ్యతతో ముందడుగు వేయాలి.. ప్రజలు భాగస్వాములు కావాలి.. జలసంరక్షణ ప్రతి ఇంటి సంకల్పంగా, ప్రతి గ్రామం లక్ష్యంగా, ప్రతి ప్రభుత్వ వ్యవస్థ కర్తవ్యంగా మారాలి. నీటిని కాపాడుకుందాం.. భవిష్యత్తును నిలబెట్టుకుందాం!

# రూ.150 కోట్లతో మూడు మండలాల్లో శాశ్వత కరువు నివారణ చర్యలు

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, రైతు కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చారిత్రకంగా కరువు ప్రభావానికి గురవుతున్న ప్రాంతాలు, వర్షాధార వ్యవసాయం అధికంగా ఉన్న జిల్లాలు, సామాజిక--ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాలు, రైతు కుటుంబాల జీవనోపాధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాంతాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. జాతీయ విపత్తుల నిర్వహణ నిధి ( ఎన్‌డిఎఫ్) సహకారంతో ఈ ప్రాజెక్ట్ చేపట్టినట్లు తెలిపారు.

శనివారం రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, విపత్తు నిర్వహణ శాఖల అధికారులతో మంత్రిసమీక్ష నిర్వహించారు. తెలంగాణలో కరువు-నిరోధక వ్యవసాయ విధానం అమలు, కరువు పీడిత ప్రాంతాల్లో శాశ్వత పరిష్కార మార్గాల అన్వేషణ, ప్రతిపాదిత ప్రాజెక్టు కార్యాచరణ, నిధుల సమర్థ వినియోగం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ , నాగర్ కర్నూల్ జిల్లా ఉప్పునూతల, నారాయణపేట్ జిల్లా మక్తల్ మండలాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈమొత్తం ప్రాజెక్ట్‌కు ప్రకృతి విపత్తుల శాఖ పర్యవేక్షణలో వ్యవసాయ శాఖ నోడల్ ఏజన్సీగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని గ్రామ మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం తోపాటు, వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలకు ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు చర్యలు చేపడతారని తెలిపారు.

కరువు నివారణ ప్రాజెక్టు అమలులో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసుకోవాలని, ఎంపిక చేసిన మండలాల్లోని ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు, స్థానిక అవసరాలకు అనుగుణంగా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి లక్ష్యాన్ని చేరేలా, పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు క్షేత్రస్థాయిలో నెరవేరుతాయని తెలిపారు.

మహిళలు, యువత, రైతులు, కులవృత్తులపై ఆధారపడిన కుటుంబాలు సహా సమాజంలోని అన్ని వర్గాల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేశారు. కరువు ప్రభావం ఒక్క వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా గ్రామీణ ఉపాధి, కుటుంబ ఆదాయాలు, సంప్రదాయ వృత్తులపై కూడా పడుతుందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి వర్గానికి ప్రయోజనం చేకూరేలా, స్థానిక పరిస్థితులకు తగిన శాశ్వత పరిష్కారాలతో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కోసం వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలని మంత్రి స్పష్టం చేశారు. నిధుల వినియోగం, పనుల ఎంపిక, అమలు విధానం, క్షేత్రస్థాయి ఫలితాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. కేవలం నిధుల ఖర్చు, పనుల పూర్తితోనే ప్రాజెక్టు విజయాన్ని అంచనా వేయకుండా, ప్రజలకు ఎంత మేరకు ప్రయోజనం చేకూరింది, కరువు సమస్యను పరిష్కరించడంలో ఎంత పురోగతి సాధించామన్నది ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో విపత్తు నిర్వహణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జ, వ్యవసాయ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎన్. గోపి తదితర అధికారులు పాల్గొన్నారు

# గవర్నర్ తో కేంద్ర మంత్రి, మాజీ గవర్నర్ భేటీ





హైదరాబాద్ 24 , అక్టోబర్ 2026 : తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార , ప్రజా పంపిణీ శాఖ, సామాజిక న్యాయం , సాధికారత శాఖ సహాయ మంత్రి బన్వారీ లాల్ వర్మ, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల మాజీ గవర్నర్ కల్రాజ్ మిశ్రా లోక్ భవన్‌లో శనివారం సాయంత్రం కలిశారు.

# కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా.. మహారాష్ట్రకు సీఎం రేవంత్ రెడ్డి

**సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా**

**తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు బోర్డు నిర్ణయం**

**సీఎం రేవంత్ రెడ్డి ముంబై పర్యటన కారణంగా అధికారులు హాజరుకాలేరని వెల్లడి**

**మంగళవారానికి సమావేశాన్ని తిరిగి షెడ్యూల్ చేసిన కేఆర్ఎంబీ**



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా నదీ జలాల పంపిణీపై చర్చించేందుకు సోమవారం (అక్టోబర్ 26) జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) 21వ సమావేశం వాయిదా పడింది. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఈ భేటీని మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ముంబై పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కాలేరని తెలంగాణ ఇంజనీర్-ఇన్-చీఫ్ కేఆర్ఎంబీకి లేఖ ద్వారా తెలియజేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు సంబంధించిన కీలక చర్చల నిమిత్తం ముఖ్యమంత్రి మహారాష్ట్రకు వెళుతున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ కారణం చేత సమావేశాన్ని వాయిదా వేయాలని కోరారు.

తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కేఆర్ఎంబీ, సమావేశాన్ని మంగళవారానికి రీషెడ్యూల్ చేసింది. ఈ మార్పునకు సంబంధించిన సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు అధికారికంగా తెలియజేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, నీటి పంపిణీకి సంబంధించిన కీలక అంశాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించనున్నారు.

# భోగాపురం నుంచి ఢిల్లీకి డైరెక్ట్ ఫ్లయిట్.. రేపటి నుంచే సేవలు

ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశ రాజధాని ఢిల్లీకి తొలిసారిగా నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం కానున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్‌లైన్స్ ఈ సర్వీసులను ఆదివారం (అక్టోబర్ 25) నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానుంది. ఉత్తరాంధ్ర నుంచి ఢిల్లీకి ఇదే మొట్టమొదటి డైరెక్ట్ ఫ్లైట్ కావడం గమనార్హం.

ఈ కొత్త సర్వీసు షెడ్యూల్ ప్రకారం, ప్రతిరోజూ ఉదయం 6:00 గంటలకు ఢిల్లీలో బయలుదేరే విమానం, ఉదయం 8:00 గంటలకు భోగాపురం విమానాశ్రయానికి చేరుకుంటుంది. అనంతరం, ఇక్కడి నుంచి తొలి సర్వీసుగా ఉదయం 8:30 గంటలకు అదే విమానం ఢిల్లీకి తిరుగు ప్రయాణం అవుతుంది.

ఈ చారిత్రక సేవలను ప్రారంభించడం కోసం విమానాశ్రయంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. జీఎంఆర్ సీఈవో/సీసీఏఓ కన్వర్ బీర్ సింగ్ కారా, ఆకాశ ఎయిర్‌లైన్స్ మేనేజర్ భూపతిరాజు అచ్యుత రామరాజు ఈ కార్యక్రమానికి హాజరై కేక్ కట్ చేసి, తొలి ప్రయాణికులకు టికెట్లను స్వయంగా అందజేయనున్నారు.

ఇప్పటివరకు ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు ఢిల్లీ వెళ్లాలంటే కనెక్టింగ్ ఫ్లైట్లపై ఆధారపడాల్సి వచ్చేది. ఈ కొత్త డైరెక్ట్ సర్వీసుతో ప్రయాణ సమయం గణనీయంగా ఆదా కావడంతో పాటు ప్రయాణం మరింత సులభతరం, సౌకర్యవంతం కానుంది. ఈ పరిణామం పట్ల ఉత్తరాంధ్ర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# లాయర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంది

## మంత్రి వివేక్ వెంకట్ స్వామి

హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి

హైద్రాబాద్ అక్టోబర్ 24;లాయర్ల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిమంత్రి వివేక్ వెంకట్ స్వామి అన్నారు. ఇందిరా భవన్ లో టిపిసిసి లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ అధ్యక్షతన టీసీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం లో పాల్గొని ప్రసంగించారు.




కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, లాయర్ల పోస్టుల భర్తీ మరియు వారికి తగిన ప్రాధాన్యత కల్పించే విషయంలో కేబినెట్లో చర్చించి, నిజంగా పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన పోస్టులు దక్కేలా చూస్తామన్నారు.

ప్రస్తుత రోజుల్లో చాలా ఇష్యూస్ కోర్టుకు వెళు న్నాయని, చాలా నిర్ణయాలు కోర్టు తీర్పుల ద్వారానే వస్తున్నందున లాయర్ల ఫెటర్నిటీ చాలా కీలకమైనదన్నారు.

లీగల్ సెల్ చైర్మన్ ఆధ్వర్యంలో 31 జిల్లాల్లో 31 లాయర్స్ సెంటర్స్ ఏర్పాటు చేస్తే దీనివల్ల ప్రతి జిల్లా కేంద్రంలోనూ కొంతమంది అడ్వకేట్లకు పోస్టులు లభించే అవకాశం ఉంది కేసీఆర్ ప్రభుత్వ హయాంలో లాయర్లందరూ గట్టిగా పోరాడి కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్లడానికి చక్కని ప్రయత్నాలు చేశారు మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు మరియు ఇతర పెద్దలు అందరితో చర్చించి, లాయర్లకు అనుకూలంగా ఉండే అంశాలను మేనిఫెస్టోలో పొందుపరిచేలా మంచి ఆలోచనతో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు

# బషీర్‌బాగ్‌లో రాముడి విగ్రహం తొలగింపు.. బందోబస్తు మధ్య తరలింపు

**హైదరాబాద్ బషీర్‌బాగ్ చౌరస్తాలో రాముడి విగ్రహం తొలగింపు**
**విజయదశమి నాడు హిందూ సంఘాలు ఏర్పాటు చేసిన విగ్రహం**
**అనుమతులు లేవంటూ ఎంబీటీ నేతల అభ్యంతరం**
**పేరు మార్పు వివాదం నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు**
**క్రేన్ సహాయంతో విగ్రహాన్ని తొలగించిన ఆలయ సిబ్బంది**



హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శ్రీరాముడి విగ్రహాన్ని శనివారం అధికారులు తొలగించారు. విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రతిష్ఠించిన ఈ విగ్రహం చుట్టూ పేరు మార్పు వివాదం నెలకొనడంతో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విశ్వహిందూ పరిషత్‌తో అనుబంధం ఉన్న భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ ఆధ్వర్యంలో ఈ విగ్రహాన్ని కూడలిలోని అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, బషీర్‌బాగ్‌ను ఇకపై "శ్రీరామ్ చౌక్"గా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పరిణామం నగరంలో రాజకీయ వివాదానికి దారితీసింది.

విగ్రహ ఏర్పాటు, పేరు మార్పు ప్రతిపాదనపై మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబీటీ) నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ లేదా నగర పోలీసుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా విగ్రహాన్ని ఎలా ఏర్పాటు చేస్తారని ఆ పార్టీ అధికార ప్రతినిధి అంజద్ ఉల్లా ఖాన్ ప్రశ్నించారు. కూడలి పేరు మార్పుపై ప్రకటనలు వస్తున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన నిలదీశారు. విగ్రహ ఏర్పాటుకు సంబంధించి ఏవైనా అధికారిక ప్రతిపాదనలు ఉన్నాయా అని ఆయన స్పష్టత కోరారు.

అభ్యంతరాలు వ్యక్తమై వివాదం తీవ్రతరం కావడంతో అధికారులు రంగంలోకి దిగారు. శనివారం ఉదయం ఆలయ సిబ్బంది క్రేన్ సహాయంతో శ్రీరాముడి విగ్రహాన్ని జాగ్రత్తగా తొలగించి లారీలోకి తరలించారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని పోలీసులు దగ్గరుండి పర్యవేక్షించారు. సమీపంలోని కనకదుర్గమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ముగిసిన కొద్ది రోజులకే ఈ ఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

# కాళేశ్వరంలో అంతరాష్ట్ర సరిహద్దు తనఖీ కేంద్రం ఏర్పాటు.




జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద ధాన్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. శనివారం పౌర సరఫరాల శాఖ, పోలీస్, పంచాయతీ శాఖల అధికారులు సిబ్బందితో కలిసి సరిహద్దు తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర లభించేలా చూడటంతో పాటు, పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యాన్ని అక్రమంగా తెలంగాణలోకి తరలించకుండా నిరోధించేందుకు ఈ తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు తావులేకుండా, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు.

కాళేశ్వరం అంతర్ రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద పోలీసు, పౌర సరఫరాల శాఖ అధికారులు సమన్వయంతో 24 గంటల పాటు నిరంతర తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. సరిహద్దు దాటి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. తనిఖీల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. రైతుల సంక్షేమం, పండించిన పంటకు మద్దతు ధర కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, పోలీస్, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జల సంరక్షణ పనులు ప్రారంభం

చొప్పదండి కరీంనగర్ జిల్లా గంగాధర మండలం హిమ్మత్‌నగర్ గ్రామంలో విబి జి గ్రామ్ జి పథకంలో భాగంగా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా డ్రైనేజీ, సోక్‌పిట్‌లు, కమ్యూనిటీ సోక్‌పిట్‌లు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణ పనులు సర్పంచ్ బీర్ల ఆనందం ఇద్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ పనుల ద్వారా వర్షపు నీటిని సమర్థవంతంగా ఒడిసిపట్టి భూగర్భ జలమట్టాలను పెంచడంతో పాటు గ్రామంలో నీటి వనరులను సంరక్షించేందుకు అవకాశం కలుగుతుంది. గ్రామ పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచడంలో కూడా ఈ పనులు దోహదపడతాయి. ఈ




కార్యక్రమంలో సర్పంచ్ బీర్ల ఆనందం ఏపీఎం సత్య ప్రకాష్, కార్యదర్శి మమత టీ ఏ సునీల్, ఫీల్డ్ అసిస్టెంట్ పద్మ, పాల్గొనారు.

# బొగ్గు లారీ డ్రైవర్లు, క్లీనర్లకు లాభాల వాటా చెల్లించాలి – ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ డిమాండ్

ఆసిఫాబాద్, కైరుగూడ ఓపెన్ కాస్ట్ నుంచి గోలేటి సీహెచ్ పీ కి బొగ్గు రవాణా చేస్తున్న లారీ డ్రైవర్లు, క్లీనర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లాభాల్లో వాటా రూ. 5,500 వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ఏరియా (గోలేటి) డీజీఎం పర్సనల్ కిరణ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు.



శుక్రవారం జీఎం కార్యాలయంలో డీజీఎంను కలిసిన ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్, టీబీజీకేఎస్ అధ్యక్షుడు అంబాల ఓదెలు మాట్లాడుతూ, బొగ్గు రవాణా చేస్తూ సింగరేణి సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి లాభాలు రావడంలో లారీ డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.

అర్హులైన డ్రైవర్లు, క్లీనర్లందరికీ లాభాల వాటా చెల్లించాలని, చెల్లించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మూడు సంవత్సరాలుగా తెలంగాణలో రాక్షస పాలన। అందుకే కాంగ్రెస్ ను వీడుతున్నాం

హైదరాబాద్ టీడీపీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలాలు కలిగిన నాయకులు ఈరోజు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని శాసిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ నాయకుల వల్ల కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం జరుగుతుందని రాహుల్ గాంధీని హెచ్చరిస్తూ నేను కాంగ్రెస్ పార్టీ నుంచి వెళ్లిపోతున్నానని ఎన్ ఎస్ యూ ఐ మాజీ స్టేట్ ప్రెసిడెంట్ భార్గవ్ దేశ్ పాండే వెల్లడించారు.

శనివారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో అయన మీడియాతో మాట్లాడారు. కానీ గత మూడు సంవత్సరాలుగా తెలంగాణలో రాక్షస పాలన సాగుతుందని అయన సొంత ప్రభుత్వంపై విమర్శలు చేసారు. తెలంగాణ యువతకు అభివృద్ధి కావాలి. మా యువతకు సూట్ అయ్యే నాయకుడు కేటీఆర్. కాబట్టి భారీ సంఖ్యలో యువత అందరం కలిసి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ చేరాలని నిశ్చయించుకున్నామని అన్నారు.

మూడు సంవత్సరాల్లో మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిన ఘనత రేవంత్ రెడ్డిది. ఈ రాక్షస పాలనకు, కాంగ్రెస్ పార్టీకి స్వస్తి చెప్పాలని మా యువత నిర్ణయించుకున్నాం. రేవంత్ రెడ్డి ఎంతసేపు ప్రతిపక్ష నాయకులను తిట్టడం తప్పిస్తే అభివృద్ధి గురించి మాట్లాడడం లేదు. తెలంగాణలో జరిగే స్కాంలపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని అన్నారు.

పదేళ్లు ప్రతిపక్షంలో కాంగ్రెస్ పార్టీ జెండాలు మోసినం. కానీ ఇప్పుడు అధికారంలో ఉండి కాంగ్రెస్ పార్టీని చంపేస్తున్నారని మండిపడ్డారు.

# హైవేపై ఘోర ప్రమాదం.. లారీని ఢీకొన్న కారు.. ఇద్దరు యువకులు మృతి మరో ఐదుగురికి తీవ్ర గాయాలు



హుజురాబాద్ విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం ముగించుకుని ఆనందంగా స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన యువకులను రోడ్డు ప్రమాదం కబళించింది. జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. పుణ్యక్షేత్రం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో జరిగిన ఈ విషాద ఘటన రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపింది. ఈ ప్రమాదం కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం రంగాపూర్ శివారులోని 563వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రాంతానికి చెందిన ఏడుగురు యువకులు విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయాన్ని దర్శించుకుని ఎర్టిగా కారులో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో హుజురాబాద్ మండలం రంగాపూర్ శివారుకు చేరుకోగానే ముందు వెళ్తున్న లారీని కారు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం లారీ కిందకు దూసుకెళ్లి నుజ్జునుజ్జయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న యువకులు తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో రామగుండం ప్రాంతానికి చెందిన బట్టారి అరవింద్ (20), మచ్చ సాయి (20) తీవ్ర గాయాలతో కారులోనే ప్రాణాలు కోల్పోయారు. కారులో ఉన్న ఎరుకల సాయి కృష్ణ, మచ్చ ఆదర్శ్, ముఖియా, వివేక్, శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. క్షణాల్లో జరిగిన ప్రమాదంతో జాతీయ రహదారిపై విషాదకర పరిస్థితి నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న హుజురాబాద్ రూరల్ సీఐ వీరబత్తిని శ్రీనివాస్ పోలీసు సిబ్బందితో కలిసి వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. కారు పూర్తిగా దెబ్బతినడంతో అందులో చిక్కుకున్న మృతదేహాలు, క్షతగాత్రులను బయటకు తీసేందుకు పోలీసులు, సహాయక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. సుమారు రెండు గంటల పాటు శ్రమించి వారిని బయటకు తీశారు. క్షతగాత్రులను తొలుత హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వారిలో మరో ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

# Raksha Expo-2026 Curtain Raiser

## కార్యక్రమంలో ముఖ్యమంత్రి



“రక్షా ఎక్స్‌పో – కర్టెన్ రైజర్” కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది.

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాల్సిందిగా మీ అందరినీ ఆహ్వానిస్తున్నాం.

గతేడాది మొదటిసారి నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ విజయవంతమైంది.

రెండోసారి నిర్వహించే సదస్సు మరింత భారీస్థాయిలో జరగబోతోంది.

రక్షణ రంగానికి చెందిన భాగస్వాములందరితో ఒకే వేదికపై చర్చించే అంతర్జాతీయ వేదికగా రక్షా ఎక్స్‌పోను తీర్చిదిద్దాలన్నది నా ఆలోచన.

ఇదొక ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమం.

ఈ సమావేశంలో రక్షణ, స్పేస్, ఏరోస్పేస్, భద్రతా రంగాలకు చెందిన ప్రముఖులు ఎంతో మంది ఉన్నారు.

మన పారిశ్రామిక రంగానికి చెందిన దిగ్గజ సంస్థలు కూడా ఇక్కడున్నాయి.

డీఆర్‌డీఓ (DRDO), హెచ్ఏఎల్ (HAL), బీడీఎల్ (BDL), మిధాని, టాటా సంస్థలు, ఎయిర్‌బస్, సాఫ్రాన్, స్కైరూట్, లాక్‌హీడ్ మార్టిన్, భారత్ ఫోర్జ్ వంటి ఎన్నో ప్రముఖ సంస్థల ప్రతినిధులు మన మధ్య ఉన్నారు.

భారతదేశంలో హైదరాబాద్ ఒక వ్యూహాత్మకమైన ప్రదేశంగా కీలకమైన స్థానంలో ఉంది.

హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరం...

అనేక ముఖ్యమైన పరిశోధనా సంస్థలకు నిలయం.

భారత సైన్యం, భారత వైమానిక దళాలకు సంబంధించిన అనేక ముఖ్యమైన స్ట్రాటజిక్ కేంద్రాలు ఇక్కడున్నాయి.

దక్షిణ భారతదేశంలో సముద్రతీరం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ.

అయినప్పటికీ, భారత నౌకాదళానికి రాష్ట్రం కీలకమైన సేవలు అందిస్తోంది.

తెలంగాణలోని వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వ్ ఫారెస్ట్‌లో అత్యంత తక్కువ పౌనఃపున్యాల (Very Low Frequency -- VLF) నౌకాదళ రాడార్ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ రంగానికి ప్రతిభావంతులైన యువత అవసరం.

అందుకు మనకు ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ఐటీ, ఐఎస్‌బీ, బిట్స్ వంటి అత్యుత్తమ విద్యాసంస్థలున్నాయి.

నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను సిద్ధం చేసేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని నిర్మిస్తున్నాం.

ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా (ATCs) తీర్చిదిద్దాం.

విజయవంతంగా పనిచేస్తున్న ఇంక్యుబేటర్లు కూడా ఇక్కడ ఉన్నాయి.

రక్షణ రంగంలో ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా భారతదేశాన్ని చూడాలన్నది నా ఆకాంక్ష.

యుద్ధానికి అవసరమైన సాంకేతికతను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి రక్షణ సాంకేతిక ఎగుమతులు చేసే దేశంగా భారత్ ఎదగాలి.

యుద్ధం కోసమే కాకుండా, శాంతిని కాపాడేందుకు కూడా ఆయుధాలు అవసరం.

శత్రువులు యుద్ధానికి దిగకుండా నిరోధించే శక్తి కూడా మనకు ఒక వ్యూహాత్మక ఆధిక్యాన్ని అందిస్తుంది.

ఈ దార్శనికతను సాకారం చేసేందుకు తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే పెద్ద ఎత్తున కృషి చేస్తోంది.

అయితే, అందుకు మీరంతా మరింతగా సహకారాన్ని అందించి మరిన్ని విజయాలను సాధించాల్సిన అవసరం ఉంది.

భారతదేశ రక్షణ పరిశ్రమకు తెలంగాణ అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా ఎదగాలి.

రక్షణ రంగంతో పాటు స్పేస్, ఏరోస్పేస్, సైబర్ సెక్యూరిటీ, కృత్రిమ మేధస్సు, డ్రోన్ టెక్నాలజీ వంటి అనేక అనుబంధ రంగాల్లో ఈ సమావేశానికి హాజరైన మీరందరూ సహకరించి లక్ష్యాన్ని సాకారం చేయాలని ఆశిస్తున్నా.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని మీరు వేసుకున్న ప్రణాళికలను రెట్టింపు చేయండి.

లక్ష్యాన్ని సాధించడానికి నా నుంచి మీకు ఎలాంటి సహకారం కావాలో చెప్పండి.

సహకరించడానికి నేను సిద్ధంగా ఉన్నా... అది నా హామీ.

తెలంగాణ రాష్ట్రం కోసం నాకొక స్పష్టమైన దార్శనికత ఉంది.

ఈ లక్ష్యాన్ని సాధించడంలో తెలంగాణ గణనీయమైన పాత్ర పోషిస్తోంది.

అయితే, ఇంకా ఎన్నో విజయాలు సాధించాల్సిన అవసరం ఉంది.

భారతదేశ రక్షణ రంగ పరిశ్రమకు అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా తెలంగాణ ఎదగాలి.

అందుకు మీ అందరి సహకారం కావాలి.

తెలంగాణ 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గతేడాది తెలంగాణ రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంట్ ను విడుదల చేశాం.

దేశ జనాబాలో ప్రస్తుతం తెలంగాణ వాటా 2.5 శాతానికి పైగా ఉంది.

దేశ స్థూల జాతీయోత్పత్తి (GDP)లో తెలంగాణ 5 శాతం వాటాను అందిస్తోంది.

2047 నాటికి ఆ వాటాను 10 శాతం సాధించాలన్నది నా లక్ష్యం.

ఈ దార్శనికతను సాకారం చేయడంలో రక్షణ ఉత్పత్తుల తయారీ, ఏరోస్పేస్, వాటి అనుబంధ రంగాలు కీలక పాత్ర పోషిస్తాయి.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ (OEMs), సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (SMEs) ఒకే వేదికపై కలుసుకునేందుకు »»Raksha Expo ఒక ప్రధాన వేదికగా మారుతుంది.

పరిశ్రమల ప్రతినిధులు ఉన్నత స్థాయి రక్షణ దళాల అధికారులు, భద్రతా రంగ అధికారులు, నిపుణులు, స్టార్టప్‌లు వినూత్న ఆలోచనలను, సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకురావాలని ఆశిస్తున్నా.

రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ లేదు...

రాజకీయంగా, ఐడియాలజీ పరంగా భేదాభిప్రాయాలు ఉన్నా.. పెట్టుబడులు, అభివృద్ధి విషయంలో మాకు ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు

కీలకమైన రంగాల్లో ఉన్న వారంతా పెద్ద పెద్ద లక్ష్యాలతో ఆలోచనలు చేయాలి.

మన దగ్గర తెలివైన, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అవసరమైన వనరులున్నాయి.

ముఖ్యంగా, అభివృద్ధి పట్ల స్పష్టమైన విధానం, దృఢ సంకల్పం, ముందుకు సాగాలనే తపన మనకుంది. త్వరలోనే “ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0”ను విడుదల చేయబోతున్నాం.

ఈ విధానం తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుంది.

డిసెంబర్‌లో జరగబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లో మిమ్మల్ని మళ్లీ కలుసుకుంటా. రక్షణ రంగంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే ఒక అగ్రగామిగా శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దేందుకు మనమందరం కలిసి పనిచేద్దాం.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కల సాకారం చేస్తాం



హైదరాబాద్:– తెలంగాణ రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల ఆకాంక్షలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 లో జర్నలిస్టు హౌసింగ్ సొసైటీకి భూములు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని మంత్రి గుర్తుచేశారు. అయితే, ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియ సుదీర్ఘకాలం నిలిచిపోయిందని తెలిపారు. 2022లో న్యాయపరమైన అడ్డంకులు తొలగిన తర్వాత కూడా గతంలో ఈ సమస్యకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చొరవ తీసుకుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీకి 2024 సెప్టెంబర్ 8వ తేదీన రవీంద్ర భారతిలో కార్యక్రమాన్ని నిర్వహించి భూమిని సొసైటీకి అప్పగించడం జరిగిందన్నారు. అనంతరం సుప్రీంకోర్టు తుది ఉత్తర్వుల నేపథ్యంలో మరోసారి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావడంతో ఈ అంశానికి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితుల్లో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో పలుమార్లు చర్చించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించే అంశంపై సమగ్రంగా సమీక్షించినట్లు మంత్రిగారు వెల్లడించారు.

జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేయాలన్నది మా ప్రభుత్వ సంకల్పం. గతంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు పునరావృతం కాకుండా, చట్టపరమైన చిక్కులు లేని విధంగా, కుటుంబాలతో గౌరవంగా నివసించేందుకు అనువైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. ఇప్పటివరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడం జరిగిందని మరోసారి కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని స్పష్టం చేశారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతోపాటు, వారికి గౌరవప్రదమైన జీవనానికి అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సొంతింటి కల నెరవేరేలా, అందరికీ ఆమోదయోగ్యమైన శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు.

# శంషాబాద్ ఎయిర్పోర్ట్ డి ఆర్ ఐ అధికారులు తనిఖీలు



## శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా విదేశీ కరెన్సీ పట్టుబడింది.

మలేషియాలోని కౌలాలంపూర్‌కు అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించిన రూ.1.56 కోట్ల విలువైన విదేశీ కరెన్సీని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (ఆఖీఎ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒక మహిళతో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. 2026 అక్టోబర్ 22, 23 తేదీల్లో అందిన పక్కా సమాచారంతో ఆఖీఎ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు శంషాబాద్ విమానాశ్రయంలో తనిఖీలు చేపట్టారు. అక్టోబర్ 22న ఎయిర్‌ఏషియా విమానం ౦ఐ–68లో హైదరాబాద్ నుంచి మలేషియాలోని కౌలాలంపూర్‌కు వెళ్లేందుకు సిద్ధమైన ఓ భారతీయ ప్రయాణికుడిని అధికారులు అడ్డుకున్నారు.

అతని ట్రాలీ బ్యాగులో తనిఖీలు నిర్వహించగా, దుస్తుల మధ్య నల్లటి ప్లాస్టిక్ కవర్‌లో దాచిన 66,600 అమెరికన్ డాలర్లు, 3,773 మలేషియా రింగిట్లు, 2 సింగపూర్ డాలర్లు గుర్తించారు. వీటి మొత్తం విలువ సుమారు రూ.63.62 లక్షలుగా అధికారులు అంచనా వేశారు..

# కుళ్లిన అల్లం.. ఫంగస్ వెల్లుల్లితో పేస్ట్ తయారీ!

### మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అత్వెల్లిలో ‘ఏ1’ కేంద్రంపై అధికారుల మెరుపుదాడి..

### 22 కిలోల వెల్లుల్లి.. 50 కిలోల అల్లం స్వాధీనం చేసినట్లు వెల్లడి....

మేడ్చల్ ప్రజలకు విక్రయించే ఆహార పదార్థాల తయారీలో ఇంత నిర్లక్ష్యమా? ఫంగస్ పట్టి కుళ్లిపోయిన అల్లం, వెల్లుల్లితో పేస్ట్ తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించడం కలకలం రేపింది. మేడ్చల్ జీహెచ్ఎంసీ పరిధిలోని అత్వెల్లి గ్రామంలో ‘ఏ1’ బ్రాండ్ తయారీ కేంద్రంపై శుక్రవారం ఉదయం ఎస్‌ఓటీ, టీజీసీఎఫ్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషనర్ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ తనిఖీల్లో 22 కిలోల కుళ్లిన వెల్లుల్లి, 50 కిలోల అల్లం గుర్తించినట్లు మేడ్చల్?కుత్బుల్లాపూర్ జోన్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ అమృత శ్రీ వెల్లడించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా వినియోగానికి పనికిరాని ముడి పదార్థాలతో అల్లం?వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి ‘ఏ1’ బ్రాండ్ పేరుతో మార్కెట్‌కు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉత్పత్తుల నమూనాలను అధికారులు సేకరించారు. ఆహార పదార్థాల తయారీకి అవసరమైన లైసెన్స్‌లు తీసుకోవడంతోపాటు పరిశుభ్రమైన ప్రదేశాల్లోనే ఉత్పత్తులు తయారు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్నట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### మహబూబాబాద్ జిల్లాలో విషాదం..

### వ్యవసాయ బావిలో యువతి మృతదేహం

మహబూబాబాద్ గార్ల మండలం సీతంపేట గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహేశ్వరి (21) వ్యవసాయ బావిలో మృతదేహమై కనిపించింది. నాలుగేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన శేఖర్‌ను ప్రేమ వివాహం చేసుకున్న మహేశ్వరికి తొమ్మిది నెలల పాప శరణ్య, రెండేళ్ల కుమారుడు దేవాన్స్ ఉన్నారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహేశ్వరి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికారు. ఈ క్రమంలో వ్యవసాయ బావిలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. మహేశ్వరి మృతికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# హయత్‌నగర్‌లో ఉద్రిక్తత..

### 255 సర్వే నంబర్ వద్ద భారీగా పోలీసుల మోహరింపు!

### ఇందిరమ్మ టవర్స్ కోసం భూసేకరణకు అధికారుల రాక

రంగారెడ్డి హయత్‌నగర్ పరిధిలోని 255 సర్వే నంబర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం కోసం స్థలాన్ని స్వాధీనం చేసుకునేందుకు అధికారులు రావడంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. పరిస్థితులు తీవ్రరూపం దాల్చకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో అక్కడ ఏం జరుగుతుందనే అంశంపై స్థానికంగా ఉత్కంఠ నెలకొంది.

# హైదరాబాద్‌లో ‘సైబర్ సిటీ ట్రెవిటా’ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం.

### 60 వేల చదరపు అడుగుల క్లబ్‌హౌస్,

### 35 ప్రపంచస్థాయి సదుపాయాలతో అల్ట్రా లగ్జరీ ప్రాజెక్ట్

హైదరాబాద్ లో సైబర్ సిటీ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న అల్ట్రా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ ‘సైబర్ సిటీ ట్రెవిటా’ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించారు. ట్రూ లగ్జరీ థీమ్‌తో రూపొందించిన ఈ ప్రాజెక్ట్‌లో 35 ప్రపంచస్థాయి సదుపాయాలతో స్కైలైన్ డెక్, 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్లబ్‌హౌస్, టెర్రస్ పూల్‌తో పాటు 75 శాతం పచ్చని ప్రదేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అత్యాధునిక బయోమెట్రిక్ సెక్యూరిటీ వాల్ట్స్, రోబోటిక్ పార్శిల్ డెలివరీ వ్యవస్థ వంటి సాంకేతిక సదుపాయాలతో విలాసవంతమైన, సురక్షితమైన జీవనశైలిని అందించడమే లక్ష్యంగా ట్రెవిటాను రూపొందించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

# టీడీపీ కంటే వైసీపీ ఎక్కువ నామినేషన్లు

నెల్లూరు, అక్టోబరు 24 ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వడం లేదంటూ వైఎస్సార్‌సీపీ చేస్తున్న దుష్ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని ఎన్నికల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అధికార కూటమి అడ్డంకులు సృష్టిస్తోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని గగ్గోలు పెడుతున్న జగన్ నాటకాలను అధికారిక లెక్కలే బట్టబయలు చేశాయి.

రాష్ట్రవ్యాప్తంగా దాఖలైన నామినేషన్ల సంఖ్యను పరిశీలిస్తే, ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏ స్థాయిలో పోటీలో ఉన్నారో, కొన్నిచోట్ల కూటమి కంటే ఎక్కువ సంఖ్యలోనే నామినేషన్లు వేసి హోరాహోరీగా రేసులో నిలిచారో స్పష్టమవుతోంది.రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 9,829 ఎంపీటీసీ స్థానాలకు గానూ మొత్తం 32,095 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకంగా 12,419 నామినేషన్లు వేయగా, తెలుగుదేశం పార్టీ తరపున 15,017 మంది నామినేషన్లు సమర్పించారు. జనసేన నుంచి 2,073, బీజేపీ నుంచి 562 నామినేషన్లు వచ్చాయి. ఇక జెడ్పీటీసీల విషయానికొస్తే.. 659 స్థానాలకు మొత్తం 2,805 నామినేషన్లు పడగా, వైఎస్సార్‌సీపీ నుంచి అత్యధికంగా 1,092 మంది పోటీలో నిలిచారు. అధికార టీడీపీ తరఫున 1,055 మంది మాత్రమే నామినేషన్లు వేయగా, జనసేన నుంచి 178, బీజేపీ నుంచి 111 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రధాన స్థానాల్లో టీడీపీ కంటే వైఎస్సార్‌సీపీ నేతలే ఎక్కువ నామినేషన్లు దాఖలు చేయడం వారి ఫేక్ ప్రచారాన్ని బట్టబయలు చేసింది.తమ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అక్రమాలను, దౌర్జన్యాలను గుర్తుచేసుకుంటూ ఇప్పుడు అధికార కూటమిపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2020లో జరిగిన పట్టణ, గ్రామీణ స్థానిక పోరులో వైఎస్సార్‌సీపీ బలవంతపు ఏకగ్రీవాలతో రికార్డు సృష్టించింది. నాడు పట్టణ ప్రాంతాల్లో 20.72 శాతం స్థానాలను ఏకగ్రీవం చేసుకోగా, గ్రామీణ ప్రాంతాల్లో 24 శాతం ఎంపీటీసీలు, 19 శాతం జెడ్పీటీసీలను ప్రతిపక్షాలను బెదిరించి, భయాందోళనలకు గురిచేసి బలవంతంగా చేజిక్కించుకున్నారు. నాడు జరిగిన విధ్వంసాలు, దాడులతో గొడవలు సృష్టించి సాధించిన ఏకగ్రీవాలనే తమ గొప్ప విజయాలుగా వైఎస్సార్‌సీపీ ప్రచారం చేసుకుంది.కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతున్నాయి.

ప్రతిపక్ష అభ్యర్థులకు పూర్తి స్వేచ్ఛ ఉండటం వల్లే భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు కావడం సాధ్యమైంది. వైఎస్సార్‌సీపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే కెమెరాల ముందు నాటకాలు ఆడుతూ, ఫేక్ వీడియోలతో నేషనల్ మీడియాను, ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారనేది ఈ అధికారిక గణాంకాలతో స్పష్టంగా నిరూపణైంది. ప్రజా క్షేత్రంలో ఎదుర్కొనే ధైర్యం లేకనే జగన్ వర్గం ఇటువంటి అసత్య ప్రచారాలను నమ్ముకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# బొత్స రూటే వేరు...

విజయనగరం. అక్టోబరు 25, ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కీలక కేంద్రమైన విజయనగరం జిల్లా పరిషత్ పీఠాన్ని దక్కించుకునేందుకు బొత్స సత్యనారాయణ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్థానాన్ని ఎలాగైనా తమ ఖాతాలోనే ఉంచుకోవాలనే పట్టుదలతో, బొత్స తన సొంత కుటుంబ సభ్యులనే రేసులో నిలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 27 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా, వాటిలో ప్రధానమైన నాలుగు కీలక నియోజకవర్గాల నుంచి తన కుటుంబీకులతో నామినేషన్లు వేయించారు.జెడ్పీ పీఠంపై కుటుంబ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు బొత్స సత్యనారాయణ పక్కా ప్రణాళికతో అభ్యర్థులను ఖరారు చేశారు. బొండపల్లి జెడ్పీటీసీ స్థానం నుంచి ఆయన కుమార్తె, భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ బొత్స అనూష నామినేషన్ దాఖలు చేశారు.అలాగే గరివిడి నుంచి కోడలు బొత్స పూజిత, గుర్ల స్థానం నుంచి సోదరి వెంకటలక్ష్మి, పూసపాటిరేగ జెడ్పీటీసీ స్థానం నుంచి సోదరుడి కుమారుడు బొత్స చైతన్య బరిలోకి దిగారు. ప్రధానంగా జెడ్పీ చైర్‌పర్సన్ స్థానానికి బొత్స అనూషను రేసులో నిలిపేందుకే ఈ ముందస్తు ఏర్పాటు చేశారనే ప్రచారం బలంగా జరుగుతోంది.జిల్లా పరిషత్ పీఠం చేజారకుండా చూసుకునేందుకే బొత్స కుటుంబం నాలుగు వైపుల నుంచి వ్యూహాత్మకంగా రంగంలోకి దిగినట్లు స్పష్టమవుతోంది. గతంలో వైఎస్సార్‌సీపీ జెడ్పీ చైర్మన్‌గా వ్యవహరించిన బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు పార్టీకి రాజీనామా చేసి అధికార కూటమిలోకి వెళ్లడం వైఎస్సార్‌సీపీకి పెద్ద షాక్‌గా మారింది. జిల్లా రాజకీయాల్లో పట్టు కోల్పోకుండా ఉండటానికి, ఇతర నేతలపై ఆధారపడకుండా బొత్స సత్యనారాయణ నేరుగా తన కుటుంబ సభ్యులనే బరిలోకి దింపారు. మొత్తం 27 జెడ్పీటీసీ స్థానాల్లో నాలుగింటిలో బొత్స కుటుంబమే రంగంలోకి దిగింది.

జిల్లాపై తమ ఆధిపత్యం ఇంకా చెక్కుచెదరలేదని నిరూపించుకోవడానికే బొత్స ఈ రిస్క్ తీసుకున్నారు. రాజకీయ ఉత్కంఠ మధ్య సాగుతున్న ఈ ఎన్నికల పోరులో బొత్స వ్యూహం ఎంతవరకు పారి విజయాన్ని అందిస్తుందో వేచి చూడాల్సిందే.

# లోకల్ బాడీ ఎన్నికల్లో పతాక స్థాయికి ఘర్షణలు

కర్నూలు అక్టోబరు 24 ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాలపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో కీలకమైన నామినేషన్ల దశలోనే అభ్యర్థులను అడ్డుకోవడం, పత్రాలను బలవంతంగా లాక్కొని చించేయడం, పరస్పరం దాడులకు దిగడం వంటి ఘటనలు కలవరపెడుతున్నాయి. అధికార తెలుగుదేశం పార్టీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటుండటంతో అసలు తప్పు ఎవరిదన్నది తేల్చడం కష్టంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలు కూడా ఇరు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగినట్లు చూపిస్తున్నాయి.ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులకు నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడం అధికారుల బాధ్యత. అలాంటి ప్రక్రియలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయన్న ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను టీడీపీ వర్గీయులు లాక్కొని చించేశారన్న వీడియోలు ప్రచారంలోకి వచ్చాయి. మరోవైపు వైసీపీ బలంగా ఉన్న ప్రాంతాల్లో టీడీపీ అభ్యర్థులపైనా దాడులు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనల్లో ఎవరు బాధితులు, ఎవరు బాధ్యులు అనే అంశాన్ని రాజకీయ వాదనల ఆధారంగా కాకుండా పూర్తి ఆధారాలతో నిర్ధారించాల్సిన అవసరం ఉంది.వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త రామకృష్ణారెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 76 హింసాత్మక ఘటనలు జరిగినట్లు ఆ పార్టీ ఆరోపించింది. వీటిలో వైఎస్సార్ కడప జిల్లాలో 22, పల్నాడులో 18, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో కలిపి 11 ఘటనలు ఉన్నట్లు పేర్కొంది. అయితే ఈ ఆరోపణలను టీడీపీ ఖండిస్తోంది. ఎన్నికల్లో ఓటమి భయంతో వైసీపీ అనవసర వివాదాలు సృష్టిస్తోందని, ఎన్నికలను వాయిదా వేయించేందుకు ప్రయత్నిస్తోందని అధికార పార్టీ నేతలు విమర్శిస్తున్నారు.పెనుకొండ, కడప , చిత్తూరు , శ్రీకాళహస్తి , పులివెందుల వంటి ప్రాంతాల్లో నామినేషన్ల విషయంలో వివాదాలు చోటుచేసుకున్నట్లు ప్రచారంలో ఉన్న వీడియోలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. మరోవైపు పుంగనూరు పరిధిలోని సదుం, రాయచోటి, మాచర్ల ప్రాంతాల్లో టీడీపీ నేతలు, అభ్యర్థులపై దాడులు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. చిత్తూరులో వాకర్ సాయంతో నామినేషన్ వేసేందుకు వెళుతున్న టీడీపీ మహిళా అభ్యర్థి అరుణకు ఎదురైన పరిస్థితికి సంబంధించిన వీడియో కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. కర్నూలు, అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో వైసీపీ శ్రేణులు టీడీపీ అభ్యర్థులను అడ్డుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అదే సమయంలో పల్నాడు, మార్కాపురం, తిరుపతి ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థులకు నామినేషన్ల విషయంలో ఆటంకాలు ఎదురైనట్లు ప్రచారం జరిగింది. కొన్ని ఘటనల్లో వాహనాలు ధ్వంసం కాగా, పోలీసు సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. జనసేన కార్యకర్తలపైనా కొన్ని చోట్ల వైసీపీ అభ్యర్థులను అడ్డుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి.ఈ పరిణామాలతో పోలీసుల వ్యవహారశైలిపైనా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తమకు అనుకూలంగా వ్యవహరించడం లేదని ఇరు పార్టీల నేతలు పరస్పరం ఆరోపించుకుంటున్నారు. శ్రీసత్యసాయి జిల్లా చెన్నై కొత్తపల్లిలో నామినేషన్ కేంద్రం వద్ద అభ్యర్థులను అనుమతించే విషయంలో వివాదం తలెత్తినట్లు టీడీపీ నేతలు ఆరోపించారు. పోలీసులు లాఠీచార్జి చేయడంతో కొందరికి గాయాలైనట్లు కూడా పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై పూర్తి వివరాలు, అధికారిక నిర్ధారణ అవసరం.మొత్తంగా చూస్తే, స్థానిక ఎన్నికలు రాజకీయ ఆధిపత్య పోరుకు వేదికగా మారుతున్నాయి. ఏ పార్టీకి బలం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఏ పార్టీకి చెందిన వారైనా నామినేషన్లను అడ్డుకోవడం, దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమే. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి అభ్యర్థికి స్వేచ్ఛగా నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించడమే ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించే మార్గం.

# జాతీయ రాజకీయాల్లోకి కేసీఆర్...

## కమ్ బ్యాక్ సాధ్యమేనా

హైదరాబాద్, అక్టోబరు 24, తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో భారత్ రాష్ట్ర సమితి పరాజయానికి ప్రధాన కారణం తాము నడిపిన ఆర్భాటపు జాతీయ రాజకీయాలేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్వయంగా వందల సార్లు ఒప్పుకున్నారు. భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు త్వరలోనే జాతీయ రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారి, ఢిల్లీ పీఠాన్ని శాసించే స్థాయిలో రీ-ఎంట్రీ ఇవ్వబోతున్నారంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెను సంచలనం రేపాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన అంబర్‌పేట్ నియోజకవర్గ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బలహీనపడుతోందని, అటు ప్రతిపక్ష కాంగ్రెస్ వైఫల్యాల వల్ల దేశంలో కాంగ్రెసేతర, బీజేపీయేతర శక్తుల అవసరం త్వరలోనే పరాకాష్టకు చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం తెలంగాణ రాష్ట్రా?నికే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను ఏకం చేయడంలో కేసీఆర్ మళ్లీ కీలకపాత్ర పోషిస్తారని స్పష్టం చేయడం గులాబీ శ్రేణుల్లో నయా ఉత్సాహాన్ని నింపింది.టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడం వల్లే తెలంగాణ ఆత్మకు, ప్రజల మనోభావాలకు పార్టీ దూరమైందని మీడియా ముఖంగా ఎన్నోమార్లు విశ్లేషించారు. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో పాత జాతీయ నినాదాలను పక్కనపెట్టి, మళ్లీ పక్కా తెలంగాణ సెంటిమెంట్‌ను తెరపైకి తెచ్చి ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అయితే ఆ ఎన్నికల్లో సైతం ఒక్క లోక్‌సభ స్థానం కూడా దక్కకపోవడంతో ప్రజలు బీఆర్ఎస్ వైఖరిని ఎంత తీవ్రంగా తిరస్కరించారో తేలిపోయింది.హైదరాబాద్‌లో జరిగిన పార్టీ అంబర్ పేట సమావేశంలో కేటీఆర్ .. మాజీ సీఎం కేసీఆర్ త్వరలోనే జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని, కాంగ్రెస్, బీజేపీయేతర కూటమిని నడిపిస్తారని చేసిన ప్రకటన రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో చేసిన మహా తప్పిదం వల్ల అధికారం పోయిందని స్వయంగా అంగీకరించిన నాయకుడే.. ఇప్పుడు అదే తప్పును మరింత బాహాటంగా సమర్థిస్తూ మాట్లాడటం ఆయన రాజకీయ పరిపక్వత లోపానికే అద్దం పడుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో అధికారం కోల్పోయి, అస్తిత్వ సంక్షోభం వెంటాడుతున్న తరుణంలో.. తెలంగాణ గడ్డపై పార్టీని నిలబెట్టుకోవాల్సింది పోయి, మళ్లీ ఢిల్లీ చక్రం తిప్పుతామంటూ ప్రకటనలు చేయడం తప్పు దిద్దుకోలేదనడానికి సాక్ష్యంగా కనిపిస్తోందన్న అభిప్రాయం వినిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల నాటికి కేసీఆర్ కేవలం తెలంగాణకే పరిమితమైన నాయకుడిగా ఉండి, ఇక్కడి రైతాంగం, నిరుద్యోగులు, ప్రజా సమస్యలపై పూర్తి దృష్టి సారించి ఉంటే బీఆర్ఎస్ అంత ఘోరంగా ఓడిపోయేది కాదన్నది బహిరంగ రహస్యం. ప్రజలు ఆయనను తెలంగాణ బిడ్డగా ఆదరించారే తప్ప, మహారాష్ట్ర, ఢిల్లీల్లో పర్యటించే జాతీయ నేతగా కాదన్న వాస్తవాన్ని బీఆర్ఎస్ అగ్రద్వయం గుర్తించలేకపోయింది. ప్రజలు ఇచ్చిన ఇంతటి భారీ గుణపాఠం తర్వాత కూడా మళ్లీ అదే జాతీయ రాజకీయం అనే నినాదాన్ని నెత్తికెత్తుకోవడం వల్ల బీఆర్ఎస్‌కు ఎటువంటి లాభమూ జరగకపోగా, తెలంగాణ ప్రజల్లో ఆ పార్టీపై ఉన్న కొద్దిపాటి సానుభూతి కూడా గల్లంతయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు.రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాల్సిన బాధ్యత ఉన్న సమయంలో.. క్షేత్రస్థాయి పోరాటాలను గాలికొదిలి మళ్లీ ఇతర రాష్ట్రాల పొత్తులు, జాతీయ ఫ్రంట్‌ల గురించి మాట్లాడటం రాజకీయంగా భారీ మైనస్‌గా మారక తప్పదు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఇప్పటికే తెలంగాణను తమ ప్రధాన ప్రయోగశాలగా మార్చుకుని పావులు కదుపుతుంటే.. బీఆర్ఎస్ మాత్రం ఇంకా భ్రమల్లోనే విహరిస్తోందన్న సంకేతాలు ప్రజల్లోకి వెళు_న్నాయి. తెలంగాణలో అధికారాన్ని కోల్పోయి, అవినీతి ఆరోపణల్లో చిక్కుకున్న బీఆర్ఎస్ నేతలు ప్రజల దృష్టిని మరల్చడానికే జాతీయ రాజకీయాలంటూ కొత్త నాటకాలాడుతున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. బిఆర్ఎస్ ఉనికికే ముప్పు ఏర్పడిన తరుణంలో జాతీయ స్థాయిలో మూడో కూటమిని నిర్మించడం సాధ్యపడదని, గతంలో టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చినా దేశవ్యాప్తంగా ఎలాంటి ప్రభావం చూపలేకపోయారని ప్రత్యర్థులు గుర్తుచేస్తున్నారు. కేసీఆర్ జాతీయ రీ-ఎంట్రీ ప్రకటన వెనుక అటు జాతీయ స్థాయిలో మారిన రాజకీయ సమీకరణాలను పసిగట్టడమే కాకుండా, ఇటు తెలంగాణలో రాబోయే ఎమ్మెల్సీ, స్థానిక ఎన్నికల్లో పార్టీ ఆధిపత్యాన్ని నిలబెట్టుకునే ద్విముఖ వ్యూహం ఉంది. రాబోయే రోజుల్లో కేసీఆర్ నేరుగా ఢిల్లీ పర్యటనలు చేపట్టి ఇతర ప్రాంతీయ నేతలతో సమావేశమవుతారా లేక కేవలం తెలంగాణ సభలకే పరిమితమవుతారా అనేది తేలితేనే ఈ థర్డ్ ఫ్రంట్ వ్యూహం ఎంతవరకు కార్యరూపం దాలుస్తుందో స్పష్టత రానుంది. తాము చేసిన తప్పిదాన్ని గుర్తించి సరిదిద్దుకోవడానికి బదులుగా, పదే పదే అదే గోతిలో పడతామంటూ కేటీఆర్ చేస్తున్న ఈ జాతీయ ప్రకటనలు మిస్ ఫైర్ అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి

## నిదానంగా ఎమ్మెల్సీ ఎన్నికలకోసం ఓటర్ల నమోదు

హైదరాబాద్, అక్టోబరు 24, తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకోసం ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతోంది. చదువుకున్న నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, ఐటీ నిపుణులు అధికంగా ఉండే రాజధాని హైదరాబాద్‌లో ఓటర్ల నమోదు ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. దీనికి విరుద్ధంగా, నల్గొండ- ఖమ్మం- వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గంలో మాత్రం ఓటర్ల నమోదు ఉత్సాహంగా సాగుతోంది. నవంబర్ 6 నాటికి ఓటర్ల నమోదుకు తుది గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రాంతాల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్ల నమోదులో విఫలమవుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్ నగర్ నియోజకవర్గంలో కేవలం 1,91,360 దరఖాస్తులు మాత్రమే అందగా, నల్గొండ- ఖమ్మం- వరంగల్ నియోజకవర్గంలో ఏకంగా 2,44,349 దరఖాస్తులు వచ్చాయి. హైదరాబాద్ పరిధిలోని రంగారెడ్డి జిల్లాలో 53,491 దరఖాస్తులు, మేడ్చల్ లో 37,364, హైదరాబాద్ జిల్లాలో 22,535, వికారాబాద్ లో 15,020 చొప్పున నమోదయ్యాయి. ఇక రెండో నియోజకవర్గానికి వస్తే? నల్గొండలో 46,038, సూర్యాపేటలో 31,512, ఖమ్మంలో 37,848 దరఖాస్తులతో గ్రామీణ-అర్బన్ మిశ్రమ ప్రాంతాలు అగ్రస్థానంలో నిలిచాయి. 2021 ఓటర్ల జాబితాతో పోలిస్తే అప్పట్లో హైదరాబాద్ నియోజకవర్గంలో 5.31 లక్షలు, నల్గొండ నియోజకవర్గంలో 5.05 లక్షల మంది ఓటర్లు ఉండేవారు. అయితే, ప్రస్తుత గణాంకాలు కేవలం అందిన దరఖాస్తులను మాత్రమే సూచిస్తున్నాయని, ఇవి తుది ఓటర్ల జాబితా వచ్చేసరికి మారే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారుఓటర్ల నమోదు ప్రక్రియ మందకొడిగా సాగడానికి ప్రధాన కారణం రాజకీయ పార్టీల వైఫల్యమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. పండుగ వాతావరణం, ఇతర రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉన్న పార్టీలు పట్టభద్రుల నమోదుపై దృష్టి పెట్టడంలో విఫలమయ్యాయి. ముఖ్యంగా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు కేవలం సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థల పైనే దృష్టి సారిస్తుండటంతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రాముఖ్యతను క్రింది స్థాయి క్యాడర్‌కు చేరవేయడంలో చొరవ చూపడం లేదు. హైదరాబాద్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన నిపుణులు, ఐటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ, నివాస ధృవీకరణ పత్రాలు సమర్పించడంలో ఉండే నిబంధనలు, అవగాహన లోపం ఓటర్ల నమోదును దెబ్బతీస్తున్నాయి. పార్టీల యంత్రాంగం బూత్ స్థాయి నుంచి పట్టభద్రులను మోబిలైజ్ చేయడంలో విఫలమవడం వల్లనే అర్హులైన లక్షలాది మంది ఓటు హక్కుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది.ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం చట్టసభల ప్రాతినిధ్యం మాత్రమే కాదు, రాబోయే రాజకీయ పరిణామాలకు ఒక రిఫరెండమ్‌గా భావిస్తారు. పట్టభద్రుల నియోజకవర్గాల్లో విజయం సాధించడం ద్వారా మేధావి వర్గం తమవెంట ఉందనే సంకేతాలను రాజకీయ పార్టీలు పంపాలనుకుంటాయి. అయితే, హైదరాబాద్ వంటి ప్రతిష్టాత్మక నియోజకవర్గంలో ఓటర్ల నమోదు పట్ల చూపుతున్న నిర్లక్ష్యం ఆయా పార్టీల బలాన్ని బలహీనపరిచే అవకాశం ఉంది. రానున్న కొద్ది రోజుల్లో పార్టీలు తమ వ్యూహాలను మార్చుకుని, అర్హులైన పట్టభద్రులతో దరఖాస్తులు పూర్తి చేయించడంలో ఎంతవరకు సఫలమవుతాయనే అంశంపైనే ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. గడువు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ పార్టీలు మేలుకుని క్రియాశీలక పాత్ర పోషిస్తాయా లేదా అనేది వేచి చూడాలి.

## జెన్ జీకి ఇష్టమయ్యే యాక్షన్ సన్నివేశాలతోఆదర్శ కుటుంబం...

హైదరాబాద్, అక్టోబరు 24, సంక్రాంతికి వస్తున్నాం' లాంటి భారీ బ్లాక్ బస్టర్ హిట్ ని అందుకున్న తర్వాత విక్టరీ వెంకటేష్ నటించిన 'ఆదర్శ కుటుంబం' చిత్రం ఎట్టకేలకు విడుదలకు నోచుకుంది. అక్టోబర్ 2 న గాంధీ జయంతి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేద్దామని అనుకున్నారు. కానీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చాలా వరకు బ్యాలన్స్ ఉండడం తో అక్టోబర్ 9 కి వాయిదా వేశారు. అప్పటికీ కూడా వర్క్ పూర్తి అవ్వకపోవడం తో , ఇప్పుడు ఈ చిత్రం అక్టోబర్ 30 న విడుదలకు సిద్ధమైంది. కాసేపటి క్రితమే ఈ సినిమాకు సంబంధించిన థియేట్రికల్ ట్రైలర్ ని ఒక గ్రాండ్ లాంచ్ ఈవెంట్ తో విడుదల చేశారు. ఈ ట్రైలర్ కి ఫ్యాన్స్ , ఆడియన్స్ నుండి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ప్రతీ షాట్ లోనూ త్రివిక్రమ్ మార్క్ పంచు డైలాగ్స్ ఉన్నాయి.ఒక మధ్య తరగతి కుటుంబం అనుకోని క్రిమినల్ కేసులో ఇరుక్కోవడం , ఆ కారణం చేత ఆ కుటుంబానికి ఎదురైనా సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్టుగా ట్రైలర్ ని చూస్తుంటే అర్థం అవుతోంది. ఈ చిత్రం లో నారా రోహిత్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఆయన డైలాగ్స్ కూడా చాలా బాగున్నాయి. ఒకపక్క త్రివిక్రమ్ మార్క్ కామెడీ , ఎమోషన్స్ ఉంటూనే , మరోపక్క జెన్ జీ ఆడియన్స్ కి బాగా ఇష్టమయ్యే యాక్షన్ సన్నివేశాలను కూడా ఈ చిత్రం లో జోడించినట్టు ట్రైలర్ ని చూస్తుంటే అర్థం అవుతోంది. ఇక తమన్ ఎప్పటి లాగానే తన మార్క్ బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ తో అదరగొట్టేసాడు అనే చెప్పొచ్చు. ఓవరాల్ గా ఒక పర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్టైనర్ లాగా అనిపిస్తోంది. క్లిక్ అయితే వెంకటేష్ కెరీర్ లో మరో 300 కోట్ల గ్రాస్ సినిమా వచ్చి చేరుతుందని బలమైన నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు ట్రేడ్ విశ్లేషకులు.

ఇప్పటికే ఈ చిత్రం నుండి రెండు పాటలు విడుదలై మంచి రెస్పాన్స్ ని సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ ట్రైలర్ ఈ చిత్రం బజ్ ని మరింత పెంచేలా ఉందని అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. ఓవర్సీస్ లో మొదట్లో ఈ చిత్రానికి ఆశించిన స్థాయి హైప్ లేదు. కానీ ఇప్పుడు మాత్రం మంచి హైప్ తో విడుదలయ్యే అవకాశాలు ఉన్నాయి. ఓవరాల్ గా వెంకటేష్ కెరీర్ లోనే బెస్ట్ ఓపెనింగ్స్ ని రాబట్టే సినిమాగా నిలుస్తుందని అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. మరి ఆ అంచనాలను ఈ చిత్రం అందుకుంటుందో లేదో తెలియాలంటే మరో వారం రోజులు ఎదురు చూడాల్సిందే.

# ఎమ్మెల్సీ ఎన్నికలు.. టీడీపీ దారెటు

నల్గొండ, అక్టోబరు 24 తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. 2027 మార్చిలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకోసం హడావిడి మొదలైపోయింది. ముఖ్యంగా నల్గొండ-వరంగల్-ఖమ్మం నియోజకవర్గం ఎన్నికపై ఎన్డీయే కూటమిలో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల మధ్య పొత్తు కొనసాగుతోంది. అయితే తెలంగాణలో మాత్రం ఈ పార్టీల మధ్య పొత్తు లేదు. ఈ స్థానంలో పోటీ చేసేందుకు ఆయా పార్టీలు అభ్యర్థులను ఖరారు చేయడంలో బిజీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తి రేపుతోంది.ఏపీలో కలిసి ప్రయాణిస్తున్న ఈ మూడు పార్టీల మధ్య సఖ్యత తెలంగాణ రాజకీయాల్లోనూ ప్రతిఫలిస్తుందా లేదా అనేదానిపై ఇప్పుడు సందిగ్ధత నెలకొంది. స్థానిక రాజకీయ సమీకరణాల నేపథ్యంలో తెలంగాణలో ఇవన్నీ వేర్వేరుగా ఉంటున్నాయి. వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సి స్థానాన్ని దక్కించుకోవాలని జనసేన ఇప్పటికే పావులు కదిపింది. ఆ పార్టీ తరఫున గడల శ్రీనివాసరావును అభ్యర్థిగా కూడా ప్రకటించేసింది. మరోవైపు, బీజేపీ కూడా ఈ స్థానంలో పోటీ పడేందుకు గట్టి పట్టుదలతో ఉంది. కాషాయ పార్టీ నుంచి పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సుంక?? బిక్షం గౌడ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.బీజేపీ, జనసేన రెండు పార్టీలు బరిలోకి దిగాలని నిశ్చయించుకోవడంతో కూటమిలో అసలు చిక్కు వచ్చిపడింది.

ఈ నేపథ్యంలో తెలంగాణ టీడీపీ వైఖరి అత్యంత కీలకంగా మారింది. ఇక్కడ టీడీపీ మద్దతు ఎవరికి దక్కుతుందనే అంశం ఆసక్తి రేపుతోంది. తెలంగాణలో తనదైన క్యాడర్, ఓటు బ్యాంక్ కలిగి ఉన్న టీడీపీ మాత్రం ఇప్పటివరకు వరంగల్ ఎమ్మెల్సి ఎన్నికలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. బరిలోకి దిగే అవకాశాలు లేవు. అయితే మిత్రపక్షాల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే దానిపై ఇంకా స్పష్టతనివ్వకుండా వేచి చూసే ధోరణిని అవలంబిస్తోంది.ఒకవేళ టీడీపీ గనుక ఒక పార్టీ వైపు మొగ్గుచూపితే, ఆ పార్టీ విజయావకాశాలు మెరుగవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. అలా కాకుండా టీడీపీ కనుక తటస్థంగా ఉండి, సొంత బాటలో నడవాలని భావిస్తే మాత్రం కూటమి పార్టీల మధ్య ఓట్ల చీలిక తప్పకపోవచ్చు. ఏపీలో బలమైన బంధంలో ఉన్న ఈ పార్టీలు, తెలంగాణలో మాత్రం తమ స్థానిక ప్రయోజనాల కోసం భిన్నమైన వ్యూహాలతో ముందుకు వెళ్తున్నాయి.మొత్తానికి.. మార్చి 2027లో జరగబోయే ఈ ఎమ్మెల్సి పోరు కేవలం రెండు పార్టీల మధ్యే కాకుండా, భవిష్యత్ రాజకీయ మనుగడకు, కూటమి సమన్వయానికి ఒకరకమైన బెంచ్‌మార్క్‌గా మారనుంది.

జనసేన అభ్యర్థిని ముందే ప్రకటించి దూకుడు ప్రదర్శిస్తుండగా, బీజేపీ తన అభ్యర్థి ఎంపికపై కసరత్తు చేస్తోంది. ఈ తరుణంలో టీడీపీ అధిష్ఠానం తీసుకోబోయే నిర్ణయం ఇరు పార్టీల రాజకీయ భవితవ్యాన్ని, ఎమ్మెల్సీ ఎన్నికను ఏమేరకు ప్రభావితం చేస్తుందో వేచి చూడాలి.

# హైదరాబాద్ జూకు వంతారా నుంచి కంగారూలు, లెమూర్ల రాక!

హైదరాబాద్, అక్టోబరు 24 హైదరాబాద్ నగరవాసులకు, ముఖ్యంగా వన్యప్రాణి ప్రేమికులకు నెహ్రూ జూలాజికల్ పార్క్ సరికొత్త జీవులను అందుబాటులోకి తీసుకురావడానికి ఏర్పాట్లు చేసింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు చెందిన ప్రముఖ గ్లోబల్ వైల్డ్‌లైఫ్ రెస్క్యూ , కన్జర్వేషన్ సెంటర్ వంతారా నుంచి విదేశీ రకాలకు చెందిన అరుదైన జంతువులను నగరానికి తీసుకొచ్చేందుకు జూ అధికారులు ప్రణాళికలను వేగవంతం చేశారు. ఆస్ట్రేలియా దేశానికి చెందిన సంకేతమైన కంగారూలు , వాలబీలు , మడగాస్కర్ మూలాలున్న రింగ్-టెయిల్డ్ లెమూర్లు, కాసోవారీ రకం పక్షులు త్వరలోనే నెహ్రూ జూ పార్క్‌లో సందడి చేయనున్నాయి. జూ చరిత్రలోనే తొలిసారిగా ఒక ఆడ, మగ కంగారూలను ప్రదర్శనగా ఉంచేందుకు ప్రత్యేక ఎన్‌క్లోజర్లను, నైట్ హౌస్‌లను అధికారులు సిద్ధం చేశారు. గతంలో 2020లో జపాన్‌లోని యోకోహామా జూలాజికల్ గార్డెన్స్ నుంచి నాలుగు కంగారూలను తీసుకురావడానికి ఒప్పందం కుదిరినప్పటికీ, కరోనా మహమ్మారి విజృంభణ వల్ల ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు వంతారా బృందం స్వయంగా హైదరాబాద్ జూలోని వసతులను, మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, జంతువుల తరలింపునకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. ప్రస్తుతం అక్కడి పునరావాస పనులు పూర్తయిన వెంటనే వీటిని నగరానికి తరలించనున్నారు.కంగారూలతో పాటు వాటిని పోలి ఉండే దాదాపు 3 అడుగుల ఎత్తు ఉండే వాలబీలు , మడగాస్కర్ ప్రాంతానికి చెందిన విశిష్టమైన రింగ్-టెయిల్డ్ లెమూర్లు జూ సందర్శకులను ఆకట్టుకోనున్నాయి. నలుపు , తెలుపు చారల పొడవైన తోకలు కలిగిన ఈ లెమూర్లు ఉదయాన్నే శరీర వేడి కోసం చేతులు చాచి నిటారుగా కూర్చునే వినూత్న ప్రవర్తనకు ప్రసిద్ధి చెందాయి. వీటికి తోడుగా, జూలోని జీబ్రాల సంఖ్యను మరింత పెంచేందుకు మరో జత జీబ్రాలను కూడా వంతారా నుంచి తీసుకురానున్నారు. ప్రస్తుతం జూలో ఉన్న ముగ్గురు జీబ్రాలు రెండు మగ, ఒక ఆడ కూడా గతంలో వంతారా నుంచే తీసుకువచ్చారు. మరోవైపు, దేశంలో ఎల్ నినో ప్రభావం, పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతల నుంచి జూలో ని మూగజీవాలను కాపాడేందుకు జూ యాజమాన్యం ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న 2,178 జీవుల 498 క్షీరదాలు, 320 సరిసృపాలు, 8 ఉభయచరాలు , పక్షులు సంరక్షణ కోసం ఎన్‌క్లోజర్ల వద్ద వాటర్ స్ప్రింక్లర్లు, ఫాగర్లు, కూలర్లు , ఎయిర్ కండిషనర్లను ఏర్పాటు చేశారు. ఎండ వేడిమి నుంచి జంతువులకు ఉపశమనం కలిగిస్తూనే, కొత్త అతిథుల కోసం ప్రత్యేక వాతావరణాన్ని అధికారులు తీర్చిదిద్దుతున్నారు.

కొత్తగా రానున్న ఈ విదేశీ వన్యప్రాణులతో నెహ్రూ జూలాజికల్ పార్క్ మరింత సందడిగా మారడంతో పాటు నగర పర్యాటకానికి పెద్ద ఎత్తున ఆకర్షణగా నిలవనుంది. జూ అధికారుల సమాచారం ప్రకారం.. వంతారా అధికారులతో మిగిలిన అధికారిక ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి, రాబోయే కొన్ని వారాల్లోనే ఈ కొత్త అరుదైన అతిథులను సాధారణ సందర్శకుల ప్రదర్శన కోసం అందుబాటులోకి తేనున్నారు.

# ఎదురుదాడులా.. లీగల్ నోటీసులా...

హైదరాబాద్, అక్టోబరు 24 తెలంగాణ రాజకీయాల్లో ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి అనుసరిస్తున్న వ్యూహాలు తీవ్ర ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి. ఇటీవల మాజీ సీఎం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ కోసం కొండపోచమ్మ సాగర్ కాలువ ద్వారా నీటిని మళ్లించారంటూ మీడియాలో వచ్చిన కథనాలు, కాంగ్రెస్ నేతలు చేసిన విమర్శలపై బీఆర్ఎస్ లీగల్ సెల్ వెంటనే రంగంలోకి దిగి లీగల్ నోటీసులు జారీ చేసింది. అంతకుముందు కూడా కేటీఆర్, హరీష్ రావుల పై ఎలాంటి ఆరోపణలు వచ్చినా.. రేవంత్ రెడ్డి, బండి సంజయ్ వంటి అగ్రనేతలకు సైతం లీగల్ నోటీసులు పంపడమే ప్రథమ మార్గంగా ఎంచుకున్నారు. అయితే, రాజకీయ రణరంగంలో శత్రుపక్షాల బాణాలకు పదునైన రాజకీయ ఎదురుదా తో సమాధానమివ్వాల్సింది పోయి.. కోర్టుల చుట్టూ, నోటీసుల చుట్టూ తిరగడం బీఆర్ఎస్‌ను ఆత్మరక్షణ లో పడేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఎదసాధారణంగా ప్రజాస్వామ్య రాజకీయంలో ప్రజల్లోకి బలంగా వెళ్లేది వ్యూహాత్మక ఎదురుదాడి మాత్రమే. ప్రత్యర్థి ఒక ఆరోపణ చేసినప్పుడు దానికి అంతే పదునైన ఆధారాలతో, మీడియా, బహిరంగ సభల వేదికగా కౌంటర్ ఇచ్చి ఆ నరేటివ్‌ను తిప్పికొట్టడమే రాజకీయ పరిణతి. కానీ బీఆర్ఎస్ నేతలు ప్రతి చిన్న విషయానికి 'కోర్టుకు వెళ్తాం, లీగల్ నోటీసులు పంపాం అనడం వల్ల.. ప్రజల్లో ఒక రకమైన భావన ఏర్పడే ముప్పు ఉంది. నోటీసులు పంపడం వల్ల ఐపీసీ, క్రమశిక్షణా పరిధిలో చట్టపరమైన రక్షణ లభిస్తుందేమో కానీ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఆరోపణలు నిజమేనేమో, అందుకే మాట్లాడకుండా లీగల్ షీల్డ్ వెనుక దాక్కుంటున్నారు అనే సందేహాలకు ఆస్కారం లభిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.గతంలో కేటీఆర్ పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఇతర సీనియర్ నాయకులకు లీగల్ నోటీసులు పంపిన ఘటనలు చూశాం. అయితే, భారతదేశంలో లీగల్ నోటీసు నోటీసుగానే మిగిలిపోయి, అవమాన నష్టపరిహారం కేసులు కోర్టుల్లో ఏళ్ల తరబడి సాగుతాయి. రాజకీయాల్లో ఎన్నికల ఫలితాలు, ప్రజాభిప్రాయం క్షణాల్లో మారిపోతుంటాయి. అలాంటప్పుడు న్యాయపరమైన నోటీసులు ఇచ్చి ప్రకటనలకు పరిమితమవ్వడం కంటే, మైక్ ముందు నిలబడి ఆధారాలను పబ్లిక్ డొమైన్‌లో పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తేనే పొలిటికల్ మైలేజ్ దక్కుతుంది. లీగల్ మార్గాన్ని ఆశ్రయించడం ద్వారా ఆరోపణలను మరింత కాలం వార్తల్లో సజీవంగా ఉంచినట్లవుతోందనే విమర్శలు కూడా ఉన్నాయి. బీఆర్ఎస్ వర్గాలు మాత్రం తమ లీగల్ వ్యూహాన్ని గట్టిగా సమర్థించుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని పథకం ప్రకారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రతిష్టను దిగజార్చేందుకు అసత్య ప్రచారాలు చేస్తోంది అని వారు ఆరోపిస్తున్నారు. రాజకీయంగా మీడియా సమావేశాలు పెట్టి ఎన్ని కౌంటర్లు ఇచ్చినా, సామాజిక మాధ్యమాలు, అనుకూల మీడియా ద్వారా తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నందున.. దానికి చట్టపరమైన చెక్ పెట్టడమే సరైన మార్గమని పార్టీ భావిస్తోంది. నోటీసులు ఇవ్వడం వల్ల భవిష్యత్తులో దుష్ప్రచారం చేసేవారిలో ఒక రకమైన భయం ఏర్పడుతుందని గులాబీ నేతలు వాదిస్తున్నారు. పొలిటికల్ మైండ్ గేమ్‌లో డిఫెన్స్ ఎప్పుడూ వీక్‌నెస్‌ను సూచిస్తుంది . అధికారంలో ఉన్న కాంగ్రెస్, బిజేపిలు బీఆర్ఎస్ బలహీనతలను పసిగట్టి వరుసగా ఆరోపణల వర్షం కురిపిస్తున్న వేళ.. బీఆర్ఎస్ కేవలం లీగల్ సెల్ కారెక్టర్‌కే పరిమితమైతే రాజకీయంగా తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. ప్రజలు నాయకుల నుంచి పదునైన వాగ్ధాటిని, ప్రజాక్షేత్రంలో వీరోచిత పోరాటాన్ని కోరుకుంటారు తప్ప, న్యాయవాదుల కాగితపు పోరాటాలను కాదని అంటున్నారు.

# కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలు!

హైదరాబాద్, అక్టోబరు 24, వచ్చే ఏడాది ఆరంభంలోనే రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ ఎన్నికలకు సంబంధించిన ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను కూడా ప్రకటించేసింది. ఎలాగైనా ఈ రెండు ఎన్నికల్లో గెలిచి, తమ పట్టు ఏమాత్రం తగ్గలేదని నిరూపించుకోవాలనుకుంటోంది. అయితే కాంగ్రెస్ ఏకపక్ష వైఖరికి నిరసనగా వామపక్షాలతో పాటు మిత్రపక్షమైన తెలంగాణ జనసమితి సొంతంగా అభ్యర్థిని రంగంలోకి దింపేందుకు వ్యూహరచన చేస్తున్నాయి. దీంతో అప్రమత్తమైన కాంగ్రెస్ పార్టీ, బుజ్జగింపులు మొదలుపెట్టింది.కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతోంది. ఈ సమయంలో జరిగే ఎలాంటి ఎన్నికలైనా ప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగానే చూడాల్సి ఉంటుంది. అందుకే వీటిని అన్ని పార్టీలూ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటూ ఉంటాయి. కాంగ్రెస్ పార్టీ కూడా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా 2028 ఎన్నికలకు గేట్ వే రెడీ చేసుకోవాలనుకుంటోంది. అందులో భాగంగానే అన్ని పార్టీలకంటే ముందే అభ్యర్థులను ఖరారు చేసేసింది. ఈ ఎన్నికలకు 77 మంది పరిశీలకులను నియమించి, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తోంది.ఇంతవరకూ బాగానే ఉంది. అయితే కాంగ్రెస్ పార్టీకి సీపీఐ, తెలంగాణ జన సమితి మిత్రపక్షాలుగా ఉన్నాయి. ఈ రెండు పార్టీలను సంప్రదించకుండానే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఖరారు చేయడంపై ఆ పార్టీలు అసంతృప్తితో ఉన్నాయి. అందుకే ఖమ్మం- వరంగల్- నల్గొండ గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి ఉమ్మడిగా అభ్యర్థిని దించాలనే ఆలోచనకు వచ్చాయి. ఈ ఉమ్మడి జిల్లాల్లో కమ్యూనిస్టుల ప్రభావం ఎక్కువ. కోదండరాం నేతృత్వంలోని టీజేఎస్ పార్టీకి విద్యావంతుల నుంచి ఆదరణ లభిస్తుందని అంచనా వేస్తున్నారు. వీళ్లిద్దరికి సీపీఎం కూడా మద్దతు తెలిపే అవకాశం కనిపిస్తోంది.ఒకవేళ సీపీఎం, సీపీఐ, టీజేఎస్ ఉమ్మడిగా అభ్యర్థిని బరిలోకి దించితే కచ్చితంగా అది కాంగ్రెస్ ఓటుబ్యాంకుపై ప్రభావం చూపిస్తుంది. ఓ వైపు బీఆర్ఎస్, మరోవైపు బీజేపీ ఈ ఎన్నికల్లో గట్టిగా ఫైట్ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ ఓటు బ్యాంకును వామపక్షాలు చీల్చితే మొదటికే మోసం రావచ్చు. పైగా ఈ జిల్లాల్లో వామపక్షాలకు గట్టి పట్టుంది. అందుకే కాంగ్రెస్ పార్టీ ఆలస్యంగా మేల్కొంది.

# హైదరాబాద్ లో తీవ్ర వాయుకాలుష్యం..

హైదరాబాద్, అక్టోబరు 24 రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యం స్లో పాయిజన్‌లా మారి మనుషుల ప్రాణాలు తీసేస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్, నల్గొండ, సంగారెడ్డి నగరాల్లో గాలి నాణ్యత క్షీణిస్తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం పరిధిలోకి వచ్చే ఈ ప్రాంతాల్లో వాహనాల పొగ, పరిశ్రమల వ్యర్థాలు, రోడ్లపై లేచే దుమ్ము, ధూళి, నిరంతర నిర్మాణ కార్యకలాపాల వల్ల ఆరోగ్యకరమైన గాలి వీచడం కష్టంగా మారింది.2025-26 వార్షిక సగటు గణాంకాల ప్రకారం, సూక్ష్మ ధూళి కణాలైన పీఎం-10 (ఖఓ-10) స్థాయిలు జాతీయ ప్రమాణాలను మించి నమోదవడంతో పరిస్థితి అదుపు తప్పుతోంది. హైదరాబాద్‌లో జాతీయ పరిమితి కంటే 33.3 శాతం అధికంగా కాలుష్యం నమోదు కాగా, సంగారెడ్డిలో 30 శాతం, నల్గొండలో 18.3 శాతం మేర అధికంగా నమోదవుతోంది.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం, గాలిలో పీఎం-10 వార్షిక సగటు క్యూబిక్ మీటరుకు 60 మైక్రోగ్రాములకు మించరాదని నిపుణులు చెబుతున్నారు. అయితే 2025-26 లెక్కల ప్రకారం హైదరాబాద్‌లో ఈ స్థాయి 80 మైక్రోగ్రాములు ఉండగా, సంగారెడ్డిలో 78 మైక్రోగ్రాములు, నల్గొండలో 71 మైక్రోగ్రాములుగా నమోదైంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పీఎం-10 వార్షిక సగటు కేవలం 15 మైక్రోగ్రాములు మాత్రమే ఉండాలి. కానీ హైదరాబాద్‌లో డబ్ల్యూహెచ్ఓ పరిమితి కంటే 5.3 రెట్లు ఎక్కువగా ఉండగా, సంగారెడ్డిలో 5.2 రెట్లు, నల్గొండలో 4.7 రెట్లు అధికంగా ప్రమాదకర స్థాయిల్లో కాలుష్యం ఉంది.ఈ సూక్ష్మ ధూళి కణాలు శ్వాస వ్యవస్థ ద్వారా శరీరంలోకి ప్రవేశించి మీ ఊపిరితిత్తులతో పాటు రక్తప్రసరణ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2019లో ప్రారంభించిన 'జాతీయ స్వచ్ఛ వాయు' కార్యక్రమం వల్ల హైదరాబాద్‌లో కాలుష్య తీవ్రత పోలిస్తే కొంత తగ్గినప్పటికీ, ఇప్పటికీ సాధారణ స్థాయిల కంటే 33.3 శాతం ఎక్కువగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దీర్ఘకాలం ఈ కాలుష్య గాలిని పీల్చడం వల్ల తీవ్రమైన శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని చిఊూ హెచ్చరిస్తోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఆస్తమా, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారిపై వాయు కాలుష్యం ప్రభావం మరీ ఎక్కువగా ఉంటుంది.

# అవినీతి అధికారులకు సెక్రటేరియట్ లో లాబీయింగ్

హైదరాబాద్, అక్టోబరు 24 తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ అధికారులు నెలకు సగటున 20 నుంచి 25 కేసుల వరకు నమోదు చేస్తూ లంచగొండి అధికారుల పాలిట సింహస్వప్నంగా మారుతున్నారు. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం, అక్రమాస్తుల కేసుల్లో దాడులు జరగడం రోజువారీ వార్తల్లో చూస్తూనే ఉన్నాం. అయితే, అలా రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన అధికారులు ఆ తర్వాత ఏమవుతున్నారు? కోర్టుల్లో శిక్షలు పడుతున్నాయా అంటే.. సచివాలయంలోని కొన్ని విభాగాల మద్దతుతో, చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని విచారణ నుంచి హాయిగా తప్పించుకుంటున్నారనే సంచలన నిజాలు బయటపడ్డాయి.హైదరాబాద్‌కు చెందిన ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సొసైటీ ప్రభుత్వానికి సమర్పించిన న నివేదిక ప్రకారం.. ఏసీబీ అధికారులు విచారణ పూర్తి చేసి సచివాలయానికి ప్రాసిక్యూషన్ అనుమతి కోసం పంపినప్పుడు తీవ్ర ఆలస్యం జరుగుతోంది. ప్రత్యక్షంగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అధికారుల కేసులను కూడా ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెడుతున్నారు. ఆ తర్వాత వాటిని కోర్టు విచారణ దాకా వెళ్లకుండా, నామమాత్రపు శాఖా పరమైన విచారణ లకు బదిలీ చేసి ఏసీబీ కేసులను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెస్తున్నారు. గడిచిన కొన్నేళ్లలో ఏసీబీ విచారణ అనుమతి కోరిన 22 కేసుల్లో ప్రభుత్వం అనుమతి నిరాకరించి, కేసులను ఉపసంహరించుకోవాలని ఆదేశించింది.అవినీతి నిరోధక చట్టం ప్రకారం ఉన్న సెక్షన్ 17ఎ నిబంధనను ప్రభుత్వ అధికారులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. అయితే దీనిపై అక్టోబర్ 16న స్పందించిన భారత అత్యున్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అధికారిక విధులు నిర్వహించడంలో తీసుకునే నిర్ణయాలకు మాత్రమే సెక్షన్ 17ఎ రక్షణ కల్పిస్తుంది. లంచం అడగడం లేదా తీసుకోవడం అనేది ఏ రకంగానూ అధికారిక విధి కిందకు రాదు. కాబట్టి రెడ్ హ్యాండెడ్‌గా లంచం తీసుకుంటూ పట్టుబడే అధికారులను విచారించడానికి ఎలాంటి ముందస్తు ప్రభుత్వ అనుమతి అవసరం లేదు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

సచివాలయంలో అవినీతి అధికారులను కాపాడుతున్న బలమైన లాబీ కి చెక్ పెట్టాలని ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ వ్యవస్థాపకులు ఎం. పద్మనాభరెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మార్గదర్శకాల ప్రకారం, లంచం కేసుల్లో పట్టుబడిన అధికారులపై సెక్షన్ 17ఎ అనుమతి నెపంతో విచారణను నిలిపివేయకుండా ఏసీబీని నేరుగా ప్రాసిక్యూషన్‌కు అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ సచివాలయమే అవినీతిపరులకు రక్షణ కవచంగా మారితే సమాజంలోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోంది.

# స్వర్ణకార శంఖారావం సభకు బయలుదేరిన వెళ్లిన స్వర్ణకారులు

రామాయంపేట మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో స్వర్ణకారులు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో పెద్ద ఎత్తున నిర్వహించే స్వర్ణకార శంఖారావం సభకు టాటా సుమోలలో బయలుదేరి తరలివెళ్లిన స్వర్ణకారులు తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా మెదక్ జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ చారి మాట్లాడుతూ స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 50 ఏళ్లు పైబడిన స్వర్ణకారులకు పెన్షన్ మంజూరు చేయాలన్నారు.అన్ని బ్యాంకుల్లో జీవో 272ను సవరించాలని అమలవుతున్న కమిషన్ విధానాన్ని రద్దు చేసి దాని స్థానంలో సమాంతర విధానాన్ని అమలు పరచాలన్నారు.తెలంగాణ రాష్ట్రంలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి అన్ని రంగాల్లో వారికి అండగా నిలవాలన్నారు.స్వర్ణకారుల సంక్షేమం కోసం తమ న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ చారి రాష్ట్ర కార్యదర్శి నెమలి శ్రీనివాస్ చారి పట్టణ అధ్యక్షులు కృష్ణాపురం రామకృష్ణ చారి ఉపాధ్యక్షులు పూన రవీందర్ చారి కోశాధికారి మైలవరం వేణు మాధవచారి సహాయ కార్యదర్శి రాయరపు కిరణ్ చారి గౌరవ అధ్యక్షులు ఎల్దీ లక్ష్మీనారాయణ చారి మాజీ ఉపాధ్యక్షులు వంగాల ముకుందం చారి వంగాల బ్రహ్మచారి యాదారం రమేష్ చారి నక్క నరేందర్ చారి మోత్కూరియాదగిరి చారి ముత్యాల మురళి చారి మద్దూరి నవీన్ చారి మల్లేపల్లి శ్రీనివాస్ చారి రాయరపు నాగరాజు చారి కొడపర్తి ధరణి చారి బోరుగోజు సంతోష్ చారి నారోజు భూమయ్య చారి పులిమామిడి భాస్కర్ చారి రాయరపు గోపి గోపీచరి రాయరాపు రవి చారి తదితరులు పాల్గొన్నారు.

# ఔషధాల అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట అవసరం!

## .(హెచ్. ప్రతాప్)

ప్రాణాలను కాపాడాల్సిన ఔషధాలు నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే ప్రజారోగ్యానికి ముప్పు తప్పదు. వైద్యుల చీటీలు లేకుండా అలవాటుగా మారే ప్రమాదమున్న మందుల విక్రయాన్ని నిరోధించేందుకు తెలంగాణ అధికారులు చేపట్టిన చర్యలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్ మహానగర పరిధిలో 106 మెడికల్ షాపుల లైసెన్సులను సస్పెండ్ చేయగా, మరో దుకాణం లైసెన్సును రద్దు చేశారు. మూడు దుకాణాలకు హెచ్చరికలు జారీ చేశారు.

తెలంగాణ ఆహార, అత్యవసర ఔషధాల ప్రమాణాల సంస్థ (టీజీ సేఫ్) ఔషధ విభాగం అక్టోబర్ 6న పోలీసుల సహకారంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించింది. ఆ తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలపై అక్టోబర్ 23న చర్యల వివరాలను ప్రకటించింది. మొత్తం 106 సస్పెన్షన్లలో 99 దుకాణాలపై తదుపరి ఉత్తర్వుల వరకు ఆంక్షలు కొనసాగుతాయి. రెండు దుకాణాలకు మూడు రోజులపాటు, ఐదింటికి ఏడు రోజులపాటు సస్పెన్షన్ విధించారు.

వైద్యుల చీటీలు లేకుండా నిర్దిష్ట మందులు విక్రయించడం, అర్హతగల ఫార్మసిస్టుల పర్యవేక్షణ లేకపోవడం, కొనుగోలు విక్రయాల బిల్లులు, సంబంధిత రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడం వంటి ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు. ట్రామడాల్, అల్ప్రజోలామ్, నైట్రజెపామ్, కోడీన్ కలిగిన దగ్గుమందులు తదితర ఔషధాల దుర్వినియోగాన్ని నిరోధించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మందులకు వైద్యపరమైన ఉపయోగాలు ఉన్నప్పటికీ, పర్యవేక్షణలేని వినియోగం ప్రమాదకరం.

ఇటువంటి ఔషధాలను వైద్య అవసరాలకు ఉపయోగించే రోగులకు మాత్రం చికిత్సలో అంతరాయం కలగకుండా చూడాలి. అందుకే నియంత్రణ పేరుతో అవసరమైన మందుల సరఫరాను పూర్తిగా నిలిపివేయడం పరిష్కారం కాదు. చట్టబద్ధమైన విక్రయ మార్గాలను బలోపేతం చేస్తూ, వైద్య చీటీలను తనిఖీ చేసే వ్యవస్థను మెరుగుపరచాలి. నిజమైన రోగుల అవసరాలు, దుర్వినియోగ ప్రమాదాలు రెండింటినీ సమతుల్యంగా పరిగణించాలి.

ప్రిస్క్రిప్షన్ ఆధారిత ఔషధాల విక్రయంలో బాధ్యతాయుతమైన పద్ధతులు తప్పనిసరి. మందుల వివరాలు, విక్రయ తేదీలు, సరఫరాదారుల బిల్లులు, నిల్వలను క్రమబద్ధంగా నమోదు చేయాలి. లైసెన్సు ఉన్నంత మాత్రాన నియమాలను విస్మరించే అవకాశం లేదనే సందేశాన్ని తాజా చర్యలు అందిస్తున్నాయి. తనిఖీలను నిరంతరం కొనసాగిస్తూనే నిజాయతీగా నిబంధనలు పాటించే ఔషధ వ్యాపారులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలి.

ఔషధ దుకాణాలపై తనిఖీల్లో కొనుగోలుదారుగా నటించి మందులను అడగడం వంటి పద్ధతులనూ అధికారులు ఉపయోగించారు. దీనివల్ల రికార్డుల్లో నిబంధనలు పాటిస్తున్నట్లు కనిపించినా, వాస్తవ విక్రయాల్లో జరిగే ఉల్లంఘనలను గుర్తించవచ్చు. తరచూ నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. మరోవైపు మారుమూల ప్రాంతాల్లోనూ నమోదిత ఫార్మసిస్టుల సేవలు అందేలా చూడడం ప్రజారోగ్యానికి అవసరం.

ప్రజలూ అప్రమత్తంగా వ్యవహరించాలి. వైద్యుడి సూచన లేకుండా నిద్రమాత్రలు, బలమైన నొప్పి నివారణ మందులు తీసుకోరాదు. ఇతరులకు ఇచ్చిన మందులను సొంతంగా ఉపయోగించకూడదు. ఔషధాలు కొనుగోలు చేసినప్పుడు బిల్లు తీసుకోవాలి. అనుమానాస్పద విక్రయాలను టీజీ సేఫ్ ఔషధ విభాగానికి ఫిర్యాదు చేయవచ్చు.

ఫిర్యాదులను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవడంలో అధికారుల స్పందన వేగంగా ఉండాలి. యువతలో మందుల దుర్వినియోగ లక్షణాలను గుర్తించేలా కుటుంబాలు, విద్యాసంస్థలకు నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కూడా అవసరం.

అక్రమ విక్రయాలను అరికట్టడం ఒక్కరోజు తనిఖీలతో సాధ్యం కాదు. పర్యవేక్షణ, ఫార్మసిస్టుల శిక్షణ, ప్రజల్లో అవగాహన కలిసినప్పుడే ఫలితం ఉంటుంది. ఔషధం వైద్యుడి మార్గదర్శకత్వంలో ఉపశమనం అందించాలి తప్ప వ్యసనానికి దారితీయకూడదు. ప్రజారోగ్య రక్షణే ప్రతి మెడికల్ షాపు ప్రథమ బాధ్య

# అంగలూరు లో డిస్ట్రిక్ట్ లెవల్ ఫోక్ డాన్స్ పోటీలు



విజయవాడ అక్టోబర్ 24 ;కృష్ణ జిల్లా గుడ్ల వల్లేరు మండలం అంగలూరు డైట్ నందు డిస్ట్రిక్ట్ లెవల్ ఫోక్ డాన్స్ మరియు రోల్ ప్లే కాంపిటీషన్స్ జరిగాయి. పాపులేషన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో భాగంగా SCERT నిర్వహించిన స్టేట్ లెవల్ ఫోక్ డాన్స్ కాంపిటీషన్స్ నందు మానసిక ఆరోగ్యం అన్న థీమ్ ను తీసుకుని పురిటిగడ్డ హైస్కూల్ ప్లస్ విద్యార్థినీలు పాల్గొన్నారు. డి.కల్యాణికీర్తన, యన్ కావ్య, యమ్ డాలి అక్షయ, కె నందినీబాయిలు గోదావరి అనే పాటకు చేసిన నృత్యానికి డిస్ట్రిక్ట్ సెకండ్ ప్రైజ్ వచ్చింది. ఈసందర్భంగా పిల్లలను. వారికి నేర్పి పోటీలకు తీసుకువెళ్ళిన తెలుగు ఉపాధ్యాయిని డా.ఓలేటి ఉమా సరస్వతిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె బి యన్ శర్మ, ఎమ్ ఈ ఓ పి వెంకటేశ్వరరావు అభినందించారు.పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యాకమిటీ అభినందనలు తెలిపారు.



# శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం--2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే.



**జూబ్లీహిల్స్ ( ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 24** హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం--2026 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ పాల్గొని సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు..ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. నవంబర్ 4వ తేదీ నుంచి శ్రీకృష్ణ సదర్ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. యాదవుల ఐక్యత, సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ యాదవ సంఘాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధజిల్లాల నాయకులు, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..




# వైభవంగా సంగారెడ్డి సాయిబాబా ఆలయ రజతోత్సవాలు

## శనివారం జరిగిన శిఖర కుంభాభిషేకంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన నిర్మల జగ్గారెడ్డి

పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల సాయిబాబా ఆలయం స్థాపించి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన రజతోత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయ కమిటీ పర్యవేక్షణలో, జగ్గారెడ్డి, నిర్మల జగ్గారెడ్డి సహకారంతో మూడు రోజులపాటు యజ్ఞయాగాదులు, కుంభ సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.



కూకట్‌పల్లికి చెందిన నరేష్ పంతులు నేతృత్వంలో 30 మంది వేద పండితులు ఈ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మొదటి రోజు సుదర్శన యాగం, రెండో రోజు శత కలశాభిషేకం, మూడో రోజు శిఖర కుంభాభిషేకం నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ సాగిన పూజలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



మూడో రోజు జరిగిన శిఖర కుంభాభిషేకంలో నిర్మల జగ్గారెడ్డి పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ముఖ్యులు టీ. కాశప్ప, కేవీ నర్సయ్య, ఎస్. వీరేందర్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం.

## ప్రారంభించిన 20వ వార్డ్ కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 24:**వైరా మున్సిపాలిటీ, 20 వ వార్డ్ శాంతినగర్ నందు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి శ్యాంబాబు ఆధ్వర్యంలో నల్గొండ -వరంగల్ -ఖమ్మం గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైనది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీసీసీ హెల్త్ సెల్ చైర్మన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ చేసుకోవాలని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, సీనియర్





నాయకులు పొదిల్ల హరినాథ్, వైరా టౌన్ ప్రెసిడెంట్ వీరంశెట్టి సీతారాములు, డిసిసి అధికార ప్రతినిధి పమ్మి అశోక్,మాజీ టౌన్ ప్రెసిడెంట్ ఏదునూరి సీతారాములు, మాజీ కౌన్సిలర్ కర్నాటి హనుమంతురావు, కొల్లి రమేష్,భరత్,వార్డ్ కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ళ రాము, బిక్యా, పండు, తేజావత్ నాగేశ్వరావు, హుస్సేన్, పృథ్వి, ఖాజా,తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేపించాలని సూచించారు

**సనత్ నగర్ ( ప్రజాబలం ప్రతినిధి నరేష్) అక్టోబర్ 24** గ్రాడ్యుయేట్ ఎన్నికల త్వరలో జరగనున్న నేపథ్యంలో అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటర్లు నమోదు చేసుకోవాలని సనత్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోలన్ బాల్ రెడ్డి అన్నారు ఈ సందర్భంగా సనత్ నగర్ లోధ అపార్ట్మెంట్ లో జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు సుమారు వందకు పైగా గ్రాడ్యుయేట్ ఎన్నికల పత్రాలను తీసుకొని అందులో 60 పత్రాలను పూర్తి చేసినట్లు తెలిపారు ఆదివారం మిగతా 40 పత్రాలను అందజేస్తామని కోలన్ బాల్ రెడ్డి కి వివరించారు ఈ సందర్భంగా కోలన్ బాల్ రెడ్డి మాట్లాడుతూ మీ మీ ప్రాంతాలలో అర్హులైన గ్రాడ్యుయేట్లను గుర్తించి ఓటర్లుగా నమోదు చేపించాలని సూచించారు ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వృధా చేయకుండా వినియోగించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో లోధా కమిటీ ప్రెసిడెంట్ ఎం వి శర్మ, వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ సుబ్బారావు, గోపికృష్ణ, ధనుంజయ్, రాజశేఖర్, బంగారు రాజు, కోర్ర శ్రీనివాస్, పీ ఎస్ ఎం మూర్తి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మీర్జా ఖలీల్ బెగ్, మీర్జా జమీర్ బెగ్, అబ్రార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు



# కృష్ణా నదిలో విషాదం..!

## పడవ మునిగి ఇద్దరు యువకులు మృతి..!

తాడేపల్లి:గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని పాతూరులో విషాద ఘటన చోటుచేసుకుంది. కృష్ణా నదిలో పడవ మునగడంతో గల్లంతైన ఇద్దరు యువకులు హరీష్, అర్జున్ మృతదేహాలు లభ్యమయ్యాయి.ఐదుగురు యువకులు సరదాగా పడవపై షికారుకు వెళ్లగా.. నది మధ్యలో పడవ ఒక్కసారిగా ఒకవైపు మునిగిపోయింది. దీంతో ముగ్గురు యువకులు ఈదుకుంటూ సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈత రాకపోవడంతో హరీష్, అర్జున్ గల్లంతయ్యారు.సమాచారం అందుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చేపట్టి ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేయాలి..సత్యం శ్రీరంగం

### పట్టభద్రుల ఓటరు నమోదు కాంగ్రెస్ విజయానికి తొలి అడుగు సత్యం శ్రీరంగం.




**కూకట్పల్లి (ప్రజాబలం) అక్టోబర్ 24:** హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో, అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకునేందుకు మాజీ పట్టణ అధ్యక్షులు సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కెపిహెచ్బి టెంపుల్ బస్‌స్టాప్‌లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కేంద్రాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రతి ఓటునూ కీలకంగా భావించాలని, ఆన్లైన్ లో ఫాం-18 ద్వారా పట్టభద్రులందరీ ఓట్లనూ నమోదు చేయించాలని, ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని ఆయన వివరించారు. ప్రతి ఓటరూను వ్యక్తిగతంగా కలవాలని సత్యం శ్రీరంగం సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడంతో పాటు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నాం. హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రులకు వివరించి, వారి సమస్యలను తెలుసుకుంటూ కాంగ్రెస్ పార్టీకి మద్దతు కూడగట్టాలి. యువత కాంగ్రెస్ వైపు ఉన్నారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. విపక్షాలకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చావు దెబ్బ తప్పదన్నారు. ప్రగతి నిరోధకులకు పట్టబద్రులు ఈ ఎన్నికల ద్వారా తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు రాజేష్ గౌడ్, సీనియర్ నాయకులు సంజీవ్ రావు, దేశాల్, విట్టల్ రెడ్డి, సాదు ప్రతాప్ రెడ్డి, కొండల్ రెడ్డి, మేకల మైఖేల్, ఏఎంసీ డైరెక్టర్ ఫణి కుమార్, డివిజన్ మాజీ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, శ్రీధర్ చారి, బాబు రావు, మహిళా నాయకురాళ్లు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అర్బన్ వైస్ ప్రెసిడెంట్‌గా పంతంగి హర్ష యాదవ్ నియామకం



**కూకట్పల్లి(ప్రజాబలం )అక్టోబర్ 24:** భారతీయ జనతా పార్టీ యువజన విభాగమైన భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రంగారెడ్డి అర్బన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా పంతంగి హర్ష యాదవ్ నియమితులయ్యారు.

ఈ సందర్భంగా పంతంగి హర్ష యాదవ్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్ యాదవ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాసరెడ్డికి, రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి తోపుకొండ మైపాల్ రెడ్డికి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కుండే గణేష్‌కు, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు పొట్లపల్లి సాయికుమార్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, యువతను పార్టీ సిద్ధాంతాల వైపు ఆకర్షిస్తూ బీజేవైఎంను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని హర్ష యాదవ్ పేర్కొన్నారు. యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, భారతీయ జనతా పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

### 26న వాల్మీకి జయంతి వేడుకలు

**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు 24:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ వేడుకలకు జిల్లాలోని ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, వాల్మీకి కుల సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి. ఝాన్సీ రాణి కోరారు.

## రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో రజిత పథకం సాధించిన విద్యార్థికి అభినందన

### ఐక్యరాజ్యసమితి దినోత్సవ సందర్భంగా ఫ్యూచర్ జెన్ స్కూలు సందర్శించిన ఎంపీడీవో

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 24:** 81వ ఐక్యరాజ్యసమితి దినోత్సవం సందర్భంగా ఫ్యూచర్ జెన్ పాఠశాలను తల్లాడ ఎంపీడీవో అంబటి శ్రీధర్ రాజు సందర్శించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచ శాంతి,సామరస్యాన్ని కాపాడుతూ దేశభక్తిని గౌరవిస్తూ హక్కుల పట్ల అవగాహనతో ఉంటూ ఇతరుల పట్ల సహకార స్వభావాన్ని కలిగి ఉండాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రపంచంలో ఆర్థిక లాభాపేక్షతో జరుగుతున్న యుద్ధ పరిణామాలను వివరిస్తూ అనేక మంది సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. అందుకని విద్యార్థులు ఒకరికొకరు ఐకమత్యంగా, ప్రజాస్వామ్య యుతంగా జీవిస్తే దేశంలో అశాంతి పరిస్థితులకు తావుండదన్నారు. అంతేకాకుండా విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగం పట్ల దృష్టి సారించే విధంగా ఉపాధ్యాయులు వారిని ప్రోత్సహించాలన్నారు.

ఈ సందర్భంగా అండర్ 14 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో పాల్గొన్న ఫ్యూచర్ జెన్ పాఠశాల విద్యార్థి సుమిత్ జాట్ రజత పథకం సాధించినందుకు అభినందించారు. అదేవిధంగా జాట్ కు శిక్షణ ఇచ్చిన పి ఈ టి దిలీప్ కుమార్ ను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను విద్యతోపాటు క్రీడలలోనూ ఇలా మంచి ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను యాజమాన్యాన్ని అభినందించారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులకు , ఉపాధ్యాయులకు మంచి సూచనలు తెలియజేసినందుకు శ్రీధర్ రాజు కు పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి సబిత కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి సబిత, డైరెక్టర్ తౌసిప్, కోఆర్డినేటర్ మధు, ప్రిన్సిపల్ పీవీ లక్ష్మణ్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో నిర్లక్ష్యం!

**అధికారుల తీరుపై 27వ వార్డు కౌన్సిలర్**
**నామా స్రవంతి ఆగ్రహం**
**313 ఇళ్లకు మంజూరు.. పూర్తయినవి 72 మాత్రమే**




**జహీరాబాద్ అక్టోబర్ 24 ప్రజాబలం ప్రతినిధి:** ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అధికారుల నిర్లక్ష్యం, సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తున్నాయని జహీరాబాద్ 27వ వార్డు కౌన్సిలర్ నామా స్రవంతి విమర్శించారు. పట్టణంలోని 37 వార్డుల లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలనకు నెల రోజుల క్రితం ఆరుగురు అధికారులను నియమించగా, వారిలో ముగ్గురు మాత్రమే అప్పుడప్పుడు విధులకు హాజరవుతున్నారని ఆరోపించారు. ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పందన కరువైందని, ఎల్1, ఎల్2, ఎల్3 జాబితాల పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

బిల్లులు రాక నిలిచిన నిర్మాణాలు

మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 313 ఇళ్లు మంజూరవగా, ఇప్పటివరకు 72 మంది మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని స్రవంతి తెలిపారు. బిల్లులు అందక కొందరు లబ్ధిదారులు పునాది స్థాయిలోనే పనులు నిలిపివేశారని పేర్కొన్నారు. ఇప్పటివరకు నిర్మాణాలు ప్రారంభించని వారి ఇళ్లను రద్దుచేసి, ఆ స్థానంలో అర్హులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి దరఖాస్తుల పరిశీలనను వెంటనే పూర్తి చేసి రెండో విడత జాబితాను విడుదల చేయాలని కోరారు. విధులకు సక్రమంగా హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకుని, వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని ఆమె స్పష్టం చేశారు.

## సీఎంఆర్ బకాయిలు చెల్లించకుంటే చర్యలు



**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబరు 24:** జిల్లా అదనపు కలెక్టర్ (పౌరసరఫరాలు) డి. విజయేందర్ రెడ్డి, శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి ఎల్. సుగుణ బాయితో కలిసి రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

గత సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీలు, ఇతర బకాయిలను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. నిర్దేశించిన గడువులోగా బకాయిలను పూర్తిగా చెల్లించని రైస్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ (ఆర్‌ఆర్) చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రిమినల్ కేసులు నమోదు చేసే పరిస్థితి రాకుండా మిల్లర్లు సహకరించాలని సూచించారు.

## ఈశ్వర్ అల్లా గూడ్స్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సమావేశం





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 24 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** ఈరోజు శనివారం ఈశ్వర్ అల్లా గూడ్స్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సమావేశం జోగిపేటలో జరిగింది. ఈకార్యక్రమానికి గౌరవఅధ్యక్షుడు మొగులయ్య,హాజరై మాట్లాడుతూ,గూడ్స్ డ్రైవర్లకు అందోల్-జోగిపేట,మున్సిపాలిటీలో అడ్డా స్థలాన్ని ఏర్పాటు చేయాలి అని ప్యాసింజర్ ఆటోలోగూడ్స్ మెటీరియల్ వేయకుండా వ్యాపారస్తులు సహకరించాల న్నారు. ఫర్టిలైజరు,సిమెంటు,స్టీలు, కంకర,ఇసుక, సిమెంట్, రింగుల, వ్యాపార యజమానులందరూ ఆటో గూడ్స్ డ్రైవర్లకు సహకరించి, వారికి కిరాయిలు చెప్పి గూడ్స్ డ్రైవర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలని వారు అన్నారు, అలాగే వారికి ఇండ్ల స్థలాలు కూడా కేటాయించాలి ఇందిరమ్మ ఇళ్లలోవారిని కూడా లబ్ధిదారుగా గుర్తించాలని వారు కోరారు,ఈ సందర్భంగా ఈశ్వర్ అల్లాఆటో డ్రైవర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్నిఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడుగా. వి, జగన్నాథరెడ్డి . ఉపాధ్యక్షులుగా ఎండి రఫీక్ ఖాన్. మరియు శ్యామ్, ప్రధాన కార్యదర్శిగా. అబ్దుల్ వహాబ్,సహాయ కార్యదర్శిగా వగ్గు భోజయ్య, కోశాధికారిగా పురం సత్యనారాయణ, సలహాదారుడుగా ఎండి.నజీర్, కార్యవర్గ సభ్యులుగా ఎండి హైమత్, ఖజా, మాసనపల్లి ఖలీద్. జీ,హరి,బి,సతీష్,రాంసన్ పల్లి, తదితరులు పాల్గొన్నారు

## ముదిరాజులను బీసీఏలో చేర్చడంపై బీసీ కులాల నిరసన

రామాయంపేట మెదక్ జిల్లారామాయంపేట మండల కేంద్రంలో శనివారం బీసీ ఐక్యకులాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు చాకలి మంగలి కులస్తులు ర్యాలీ చేపట్టారు. అనంతరం మెదక్ రోడ్ లో ఉన్న అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ముదిరాజ్ కులస్తులను బీసీఏలో చేర్చే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వారు ఆందోళన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అధ్యక్షులు సంగు స్వామి బీసీ కుల నాయకులు మామిడి సిద్ధరాములు మ్యాథరి భాను ఐక్యకులాల నాయకులు చాకలి మంగలి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుడివాడ చేరుకున్న పోలింగ్ బ్యాలెట్ బాక్సులు

గుడివాడ స్థానిక సంస్థల ఎన్నికలకోసం పోలింగ్ బ్యాలెట్ బాక్సులు గుడివాడ చేరుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తుంది. గుడివాడ పురపాలక సంఘ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్స్ లను భద్రపరచారు. ఎన్నికల పోలింగ్ కు మొత్తం 350 బాక్సులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

## పట్లూర్ గ్రామ పంచాయతీలో రీఛార్జ్ బోర్ వెల్స్ స్ట్రక్చర్ పరిశీలించిన డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఎంపీడీ వో శాంత, సర్పంచ్ పరశురాశీ,





**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 24(ప్రజాబల 0) వికారాబాద్ జిల్లా;** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామపంచాయతీలో రీఛార్జ్ బోర్వెల్ స్ట్రక్చర్ పనులను డిఆర్డిఓ శ్రీనివాస్,పరిశీలించడం జరిగింది కావలసినసలహాలు సూచనలు చేయడం జరిగినది కార్యక్రమంలో ఎంపీడీవో మేడం శాంత ,సర్పంచ్ శ్రీ పరశురాం మాజీ సర్పంచ్ శ్రీ తుమ్మలసురేష్ ఏపీఎం సమ్మయ్య , ఏపీఓ అంజి రెడ్డి , టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ ,పంచాయతీ కార్యదర్శి గోపాల్ , ఫీల్డ్ అసిస్టెంట్ విశ్వనాథం , పాల్గొనడం జరిగినది పట్లూరు జిపిలు11 ఫారం పండులు మంజూరైనవి ఆరు పూర్తయినవి మిగిలినవి రన్నింగ్ లో ఉన్నవి బోర్వెల్ రీఛార్జి స్ట్రక్చర్స్ 5 సాంక్షన్ అయినవి మూడు ఇన్ ప్రోగ్రెస్ లో ఉన్నది డ్రైనేజీ సోఫిట్ ఒకటి కమ్యూనిటీ సోర్పిట్లు రెండు మ్యాజిక్ సోకిట్లో ఐదు జరుగుచున్నది అదేవిధంగా పట్లూర్ జిపి లో పింఛన్ వెరిఫికేషన్ చేయడం జరిగింది. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ ప్రభుత్వం తప్పకుండా ఇచ్చే విధంగా కృషి చేస్తుందని ఎంపీడీవో శాంతమ్మ, గ్రామ సర్పంచ్ పరశురాం తెలిపారు

## ఎ ల్ నీ నో ప్రభావంతో ఎండిన వారి పంట రైతులకు శాపంగా మారిన ఎండలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 24 వాజేడు** ములుగు జిల్లాలోని అన్ని మండలాలలో ఎ ల్ నీ నో ప్రభావంతో ఎండిన వరి పంటలు వర్షాకాలంలో వర్షాలు పడతాయని ఆలోచనతో పంటలు సాగు చేస్తుండగా ఎల్ నినో ప్రభావం దేశమంతటా ప్రభావాన్ని చూపుతుంది కష్టపడి పండించే పంటకు నీరు లేక భూమి పగుళ్లు తేలాయి దీనితో రైతులు కళ్ళల్లో కన్నీళ్లు పుట్టిస్తున్నాయి పెట్టుబడి తెచ్చి సాగు చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాలని ఆలోచన ఉన్న రైతులకు నిరాశ మిగిలింది మరోవైపు. మిర్చి తోటలు ఎండల ప్రభావానికి మొక్కలు ఎండిపోయి రైతులకు ఇబ్బందిగా మారుతుంది వర్షాకాలం ఎండ కాలాన్ని తలపిస్తుంది చలికాలంలో కూడా ఎండలు ఎక్కువ కొట్టడంతో ప్రజలు వేడిని తాపానికి తట్టుకోలేకపోతున్నారు మరోపక్క వాగులలో వంకలలో నీరు లేకపోవడంతో జంతువులు దాహం తీర్చుకోలేని పరిస్థితి కనబడుతుంది ఎండలు ఇలాగే కొనసాగితే రైతులకు పెద్ద నష్టం వాటిలె పరిస్థితి కనబడుతుంది జంతువు జాలం దాహం తీర్చుకోలేక మృత్యువాత పడతాయని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని నష్టపకారం చెల్లించి రైతులకు అండగా నిలవాలని రైతుల తెలిపారు

## చెక్ పోస్ట్ ల వద్ద పోలీసుల డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం మద్యం సీసా వదిలి స్టీరింగ్ పట్టిన డ్రైవర్లు




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 24 వాజేడు** ములుగు జిల్లా వాజేడు మండలంలోని మండపాక పోలీస్ చెక్ పోస్ట్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించిన వాజేడు పోలీసులు ఎస్పీ ఆదేశాల మేరకు ముమ్మర తనిఖీలు చేపట్టిన వాజేడు మంగపేట ఏటూరు నాగారం పోలీసులు దీనితో ఇసుక లారీ డ్రైవర్లు మందు సీసాలను వదిలి లారీ స్టీరింగ్ పట్టుకున్న పరిస్థితి కనబడుతుంది జిల్లా ఎస్పీ రామ్నాథ్ కేకన్ ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ వలన కొన్ని ప్రమాదాలు తగ్గినట్లు తెలుస్తుంది దీనితో వాహనదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు డ్రంక్ అండ్ డ్రైవ్ ఇలాగే ఎప్పటికీ కొనసాగాలని వాహనదారులు కోరుకుంటూ జిల్లా ఎస్పీ కి కృతజ్ఞతలు తెలిపారు

## రూ. 1.1 కోట్ల విలువైన మెథాంఫెటమైన్ పట్టివేత



హైదరాబాద్‌లో 1.1 కోట్ల విలువైన మెథాంఫెటమైన్ పట్టివేసారు. భోపాల్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ప్రయాణికుల బస్సులో డీఆర్ఐ అధికారులు 1.136 కిలోల మెథాంఫెటమైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్లీపర్ బెర్త్‌ల కింద పరుపుల మధ్య నాలుగు ప్యాకెట్లలో దాచిన మాదకద్రవ్యాలను గుర్తించారు. వీటి విలువ సుమారు ?1.1 కోట్లు ఉంటుందని అంచనా.

# మంత్రి సీతక్క గారి ఆదేశాల మేరకు

## కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు కర్ల అరుణ

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 24 ఏటూరునాగారం**శనివారం మంత్రి సీతక్క గారి ఆదేశాల మేరకు ఏటూర్ నాగారం తహసీల్దార్ కార్యాలయంలో ఏటూర్ నాగారం మండలం లోని పలు గ్రామాలలో తహసిల్దార్ గుర్రం జగదీష్ ఆధ్వర్యంలో ఐదుగురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి
ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు
బ్లాక్ ఆత్మ కమిటీ చైర్మన్ కర్ల అరుణ చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కులు అందించడం జరిగింది.



1. అజ్మీర రజిత (దొడ్ల)
2. అందె నాగమ్మ (కొండాయి)
3. దబ్బా కట్ల జ్యోతి (కొండాయి)
4. మండపు సరస్వతి (రోహిర్)
5. దెబ్బ కట్ల అరుణ (మల్యాల)

అందించడం జరిగింది.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నిరుపేదలకు అండదండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులు మరి ఏ ప్రభుత్వం చేపట్టలేదని మంత్రి సీతక్క గారి చొరవ తో ములుగు జిల్లాలో అనేక గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కళ్యాణ లక్ష్మి చెక్కులు, షాదీ ముబారక్ అనేక సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ రాజేష్, ఆర్ ఐ కిరణ్ కుమార్ జిపిఓలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## అటవీ సరిహద్దు వివాదాలు పరిష్కరించి, భూముల రీ సర్వేను వేగవంతం చేయాలి.

### రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ.
### రైతులకు ముందస్తు సమాచారం ఇచ్చి రీ సర్వే చేపట్టాలి.
### భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ సమీక్ష.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 24 కలెక్టర్** శనివారం భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో భూముల రీ సర్వే పురోగతి, బృందాల ఏర్పాటు, అటవీ సరిహద్దు వివాదాలు తదితర అంశాలపై సమీక్షించారు.



ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్ధడే హేమంత్ సహదేవరావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా లోకేశ్ కుమార్ మాట్లాడుతూ రీ సర్వే పనులు సక్రమంగా సాగేందుకు అవసరమైన బృందాలను ఏర్పాటు చేసి, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అటవీ సరిహద్దు వివాదాలను సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు సమాచారం అందించాలని తెలిపారు. ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న రైతులకు కూడా వారి భూముల్లో సర్వే నిర్వహించే తేదీలను ముందుగానే తెలియజేసి, వారు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సర్వే సందర్భంగా క్షేత్రస్థాయి రిజిస్టర్లను తప్పనిసరిగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

సర్వే పనులకు అవసరమైన అదనపు రోవర్ పరికరాలను ప్రభుత్వం తగిన సంఖ్యలో సమకూరుస్తుందని తెలిపారు. భూ భారతి తరహాలో రీ సర్వే కోసం ప్రత్యేకంగా కొత్త పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సిబ్బంది, పరికరాలను సమర్థంగా వినియోగించుకొని పనులను వేగవంతం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, సర్వే, భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు కిషన్ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్లు నితీష్, మల్లేశ్వర్‌రావు, సర్వేయర్ గుణవంత్‌రావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విధులకు హాజరుకాని 54 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలు రద్దు -- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రజాబలం ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా పరిధిలో విధులకు హాజరుకాకుండా, షోకాజ్ నోటీసులకు స్పందించని 54 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను తక్షణమే రద్దు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి తెలిపారు.

జిల్లాలో మొత్తం 281 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించగా, వారిలో 102 మంది విధులకు హాజరుకాకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. నోటీసులకు స్పందించి 48 మంది తిరిగి విధుల్లో చేరగా, ఎలాంటి స్పందన ఇవ్వని మిగిలిన 54 మంది సర్వేయర్ల సేవలను రద్దు చేసినట్లు వెల్లడించారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రీ సర్వే కార్యక్రమంలో లైసెన్స్ సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రీ సర్వే పనుల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాల్గొని, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

రీ సర్వే పనుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సర్వేయర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని స్పష్టం చేశారు. విధులకు గైర్హాజరు కావడం, అధికారుల ఆదేశాలను పాటించకపోవడం వంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించారు.

విధులకు హాజరుకాని సర్వేయర్ల స్థానంలో కొత్త లైసెన్స్ సర్వేయర్లను నియమించి, రీ సర్వే పనులు నిరంతరాయంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిగిలిన లైసెన్స్ సర్వేయర్లందరూ ఈ విషయాన్ని గమనించి, విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా అదనపు కలెక్టర్ సూచించారు.

## ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐక్యరాజ్య సమితి స్థాపన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్న విద్యార్థులు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 24 .** ఏటూరు నాగారం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. రేణుక అధ్యక్షత వహించగా, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి కె. రమేశ్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు.




ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. బి. రేణుక మాట్లాడుతూ ప్రపంచ శాంతి, అభివృద్ధి, మానవ హక్కుల పరిరక్షణలో యుఎన్ఓ పాత్ర అత్యంత ప్రాధాన్యత కలిగింది. విద్యార్థులు ప్రపంచ పౌరులుగా ఆలోచిస్తూ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి" అని తెలిపారు.రాజనీతి శాస్త్ర విభాగధిపతి కె. రమేష్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి యొక్క చరిత్ర, అంతర్జాతీయ ప్రాధాన్యతపై మరియు దాని ప్రధాన అంగాల గూర్చి విద్యార్థులకు తెలియజేశారు.కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులు యుఎన్ఓ యొక్క చరిత్ర, లక్ష్యాలు, అంతర్జాతీయ ప్రాధాన్యతపై ప్రసంగాలు చేసి తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

## నషా ముక్త్ భారత్ కార్యక్రమాలను విజయవంతం చేయాలి.

### గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ ఐఏఎస్.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతిని ధి అక్టోబర్ 24 ములుగు**శనివారం జిల్లా అదనపు కలెక్టర్లు, జిల్లా రెడ్‌క్రాస్ శాఖల ప్రతినిధులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కార్యక్రమాల ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు.



ములుగు సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అక్టోబర్ 28న నిర్వహించనున్న ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీ, రక్తదాన శిబిరాలకు ఏర్పాట్లు చేపట్టాలని దాన కిషోర్ సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ అల్లం అప్పయ్య, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, సెక్రటరీ రాజి రెడ్డి, కోశాధికారి శిరుప సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు అండగా పీ.ఎం రాహత్ పథకం




హైదరాబాద్, అక్టోబర్ 24: రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం అందించే పీ.ఎం రాహత్ పథకంలో రాష్ట్రంలోని అన్ని నెట్ వర్క్ హాస్పిటల్స్ ను నమోదుచేయించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కోరారు. ప్రధాన మంత్రి రోడ్డు ప్రమాద బాధితులకు ఆసుపత్రిలో మెరుగైన చికిత్సా పథకం (పీ.ఎం రాహత్) అమలుపై రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, ఎస్.పి.లు, ట్రాన్స్పోర్ట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రవాణా శాఖ కమీషనర్ ఇలంబర్తి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు, ఆరోగ్య శ్రీ సి.ఈ.ఓ జెండగి హనుమంతు లు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సి.ఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను తక్షణమే గోల్డ్ అవర్ లో సమీపంలోని ఆసుపత్రిలో చేర్పితే వైద్య చికిత్సలకు పీ.ఎం రాహత్ పథకం కింద లక్షన్నర రూపాయ విలువైన చికిత్సలు అందించడం జరుగుతుందని అన్నారు. అయితే, ఈ పీ.ఎం రాహత్ పథకంలో రాష్ట్రంలోని హాస్పిటల్స్ నమోదు చేయించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అమలు చేస్తున్న ఆరోగ్య శ్రీ పథకంలో ఒక వెయ్యికి పైగా హాస్పిటల్స్ నమోదు కాగా, ఈ పీ.ఎం రాహత్ స్కీమ్ లో కేవలం 469 ఆసుపత్రులు మాత్రమే ఎన్రోల్ అయ్యాయని తెలిపారు. మిగిలిన ఆసుపత్రులన్నింటినీ ఈ పీ.ఎం రాహత్ పథకంలో నమోదు అయ్యేవిధంగా తగు చర్య తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సి.ఎస్ ఆదేశించారు. ఈ పథకం క్రింద ప్రతీ సంవత్సరం కనీసం ఒక వంద కోట్లరూపాయలు చికిత్సలకు అందించే అవకాశం ఉందని వివరించారు. తద్వారా ఆరోగ్య శ్రీ పథకానికి కూడా భారం తగ్గుతుందని అన్నారు. అయితే, ఈ పీ.ఎం రాహత్ పథకం క్రింద చికిత్సలు జరపాలంటే తగు పోలీసు దర్యాప్తు తదితర నిబంధనలను పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, అక్టోబర్ 24:లి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో వివిధ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా ఉపాధి అధికారి ఎం.రాధిక తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. లులూ మాల్, ష్నైడర్ ఎలక్ట్రిక్, సప్త ఇన్ఫోటెక్ సొల్యూషన్స్, కేఎల్ గ్రూప్, రవిన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థల్లో వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 600 ఉద్యోగావకాశాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.లులూ మాల్, ష్నైడర్ ఎలక్ట్రిక్, సప్త ఇన్ఫోటెక్ సొల్యూషన్స్, కేఎల్ గ్రూప్ సంస్థల్లో ఒక్కొక్కటిలో 100 చొప్పున, రవిన్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో 200 ఉద్యోగాలకు అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. పదో తరగతి నుంచి డిప్లొమా, ఇంజినీరింగ్ తదితర విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు తమ అర్హతలకు అనుగుణంగా ఈ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగాల అర్హతలు, ఎంపిక విధానం, ఇతర వివరాల కోసం జిల్లా ఉపాధి కల్పన కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు లి9866645024, 78426175960 నంబర్లలో సంప్రదించవచ్చు.

### ఎంపీటీసీ నామినేషన్లన్నీ ఓకే

బేతంచెర్ల: :మండలంలోని 15 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి దాఖలైన 18 నామినేషన్లకు అధికారులు ఆమోదం తెలిపారు.శనివారం నిర్వహించిన పరిశీలనలోఅభ్యర్థులు సమర్పించిన పత్రాలన్నీ సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల అధికారి బషీర్ నిషా బేగం,అసిస్టెంట్ ఎన్నికల అధికారి ఫజులు రహిమాన్ లు వెల్లడించారు.మొత్తం నామినేషన్లలో టీడీపీ నుంచి10,వైసీపీ నుంచి6,జనసేన నుంచి2 దాఖలయ్యాయి.పత్రాల పరిశీలనలో ఎలాంటి లోపాలు లేకపోవడంతో అన్ని నామినేషన్లు ఆమోదం తెలిపారు.

## రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదు

### నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి.



**మెదక్ జిల్లా కొల్చారం మండలం అక్టోబర్ 24 (ప్రజాబలం) ప్రతినిధి:** ప్రాథమిక సహకార సంఘం కొనుగోలు కేంద్రాలను మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని కొంగోడు అంశానిపల్లి వసురం తండా కొల్చారం వరిగుంతం పోతంశెట్టిపల్లి అప్పాజీపల్లి కేంద్రాలను ముఖ్యఅతిథిగా నర్సాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి గారి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేయబోయి కీడు చేస్తున్నప్పటికీ బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రజాప్రతినిధులు రైతులకు అండగా ఉండి ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రజల పక్షాన ఎప్పటికీ ఉంటామని అన్నారు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రైతులకు అన్యాయం చేస్తున్నారని వ్యవసాయానికి కరెంటు సరిగ్గా లేకపోవడంతో నీటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది అని అన్నారు పంటలు ఎండిపోయిన ఎకరానికి 30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామని ప్రభుత్వాన్ని కోరారు అనంతరం ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన అంశాన్ని పల్లిలో మరియు నాయిని జలాల్పూర్ గ్రామ మాజీ సర్పంచ్ తనయుడు కర్రె పెద్ద సంజీవులు కు మంజూరైన ఇంటికి వెళ్లి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు కర్రె పెద్ద సంజీవులు సునీత లక్ష్మారెడ్డి గారి చొరవతో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు కుటుంబీకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్ చారి డిప్యూటీ తాసిల్దార్ నాగవర్ధన్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుమలత ఏ ఈ ఓ గౌతమి జిపిఓ పద్మ ,కొల్చారం మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గౌరీ శంకర్ గుప్తా మండల ఎంపీటీసీ ఫోరం మాజీ అధ్యక్షులు ఉదయ వేమారెడ్డి పిఎసిఎస్ ఉపాధ్యక్షులు గంపల లక్ష్మయ్య ఆయా గ్రామాల సర్పంచులు దుబ్బ గళ్ళ స్వామి, గీతా రమేష్, వినోద్ నాయక్ మండల నాయకులు నాయిని శేషగిరి దగ్గు మల్లేశం కర్రె పెద్ద సంజీవులు వార్డు సభ్యులు నరసాగౌడ్ దుర్గయ్య మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు







## విద్యుత్ షాక్‌తో మూడు ఎకరాల చెరుకు దగ్ధం

### రైతుకు రూ.5 లక్షలకు పైగా నష్టం



**జహీరాబాద్, అక్టోబరు 24 ప్రజా బలం ప్రతినిధి:** జహీరాబాద్ మండలం బూర్దిపాడ్ గ్రామంలో విద్యుత్ షాక్ కారణంగా రైతు పెంటారెడ్డికి చెందిన మూడు ఎకరాల చెరుకు పంట దగ్ధమైంది. ఈ ప్రమాదంలో చేతికొచ్చిన సుమారు 150 టన్నుల చెరుకుతో పాటు డ్రిప్ పైపులు, ఇతర పరికరాలు కాలిపోయాయి. అగ్నిమాపక శాఖ అధికారుల అంచనా ప్రకారం రూ.5 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే పంటలో అధిక భాగం కాలిపోయింది. మరో 15 రోజుల్లో చక్కెర కర్మాగారాలు ప్రారంభమై చెరుకు తరలించే సమయంలో ఈ ప్రమాదం జరగడంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. చేతికొచ్చిన పంట కళ్లముందే అగ్నికి ఆహుతి కావడంతో రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

## రాష్ట్రంలో రాక్షస పాలన

### కేసిఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి



**హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కాకుండా టిడిపి బిజెపి ఆర్ఎస్ఎస్ కనుసనలో నడుస్తున్న ప్రభుత్వం కొనసాగుతుందని మాజీ ఎం ఎస్ యు ఐ అధ్యక్షుడు భార్గవ్దేశ్ పాండే విమర్శించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్బుల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న శైలిపై తీవ్ర స్థాయిల విమర్శలు గుప్పించారు. జాతీయస్థాయిలో రాహుల్ గాంధీ రాజ్యాంగ బద్ద పాలన కావాలని కోరుతుండగా రాష్ట్రంలో రాజ్యాంగ విరుద్ధంగా ఎమ్మెల్యేల కొనుగోలు ప్రయత్నం జరుగుతుందని విమర్శించారు. మూడేళ్ల రేవంత్ రాక్షస పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిపోయింది అన్నారు. తెలంగాణకు శ్రీరామరక్ష మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. ఈ దేవతంలో తమంత నవంబర్ 1న ఆదిలాబాద్ లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి వేలాదిమంది తో బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు.





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 24 కలెక్టరేట్** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో వైద్య చికిత్స అందించి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా సమర్థవంతంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

ప్రమాద బాధితులకు చికిత్స ఖర్చుతో సంబంధం లేకుండా సమీపంలోని ఆసుపత్రుల్లో తక్షణవైద్యసేవలు అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాద బాధితుల చికిత్స పథకం–2025 కింద పీఎం రాహత్ పథకం అమలు పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్ పి సుధీర్ రామ్ నాథ్ కేకన్ తో కలిసి హాజరయ్యారు.

పీఎం రాహత్ పథకం అమలు విధానం, ఆసుపత్రుల్లో బాధితులకు వైద్య సేవలు అందించే ప్రక్రియ, ప్రమాద వివరాల నమోదు, క్లెయిమ్‌ల ఆమోదం, నిధుల విడుదల తదితర అంశాలను అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితుడికి వైద్య చికిత్స అందించడం అత్యంత కీలకమని తెలిపారు. గోల్డెన్ అవర్‌లో తగిన చికిత్స అందించడం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. ప్రమాద బాధితులను చికిత్స ఖర్చుల గురించి ఆలోచించకుండా సమీపంలోని ప్రభుత్వ లేదా పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.

పీఎం రాహత్ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ఒక్కొక్కరికి రూ. 1.50 లక్షల వరకు చికిత్స ఖర్చును నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఈ పథకం కింద చికిత్స పొందుతున్న ప్రమాద బాధితుల సంఖ్య తక్కువగా ఉందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పథకం ప్రయోజనాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఆదేశించారు.

పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఏటా సుమారు రూ.100 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ నిధులను ఆదా చేసే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాద బాధితులకు మొదట పీఎం రాహత్ పథకం కింద నిర్దేశిత పరిమితి వరకు చికిత్స అందించాలని, ఆ పరిమితి దాటిన తర్వాత కూడా వైద్యపరంగా అవసరమైతే నిబంధనల ప్రకారం ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించి బాధితుల ప్రాణాలను కాపాడాలని సూచించారు.

పథకం అమలుకు అన్ని ఆసుపత్రులు నమోదు కావాలి.

పీఎం రాహత్ పథకాన్ని అమలు చేసేందుకు జిల్లాల్లోని అన్ని ఆసుపత్రులు సంబంధిత పోర్టల్‌లో నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులన్నీ పథకం అమలుకు అవసరమైన నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. నమోదైన ఆసుపత్రుల్లో ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, అర్హులైన బాధితులకు పథకం ప్రయోజనాలు అందకుండా ఉండే పరిస్థితులు తలెత్తకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు.

ప్రభుత్వ, పథకం పరిధిలోని ప్రైవేట్ ఆసుపత్రులు రోడ్డు ప్రమాద కేసులను నేషనల్ హెల్త్ అథారిటీకి చెందిన టీఎంఎస్ 2.0 పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

ప్రతి ప్రమాదానికి సంబంధించిన వివరాలను ఈ–డీఏఆర్ (eDAR) పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు అవసరమైన ధ్రువీకరణలు, ఆమోదాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ–డీఏఆర్‌లో ప్రతి ప్రమాద కేసు నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలి.

ప్రమాదం జరిగిన 24 గంటల్లోపు నమోదైన కేసులకు సంబంధించి ఆసుపత్రుల నుంచి వచ్చే ధ్రువీకరణ అభ్యర్థనలను పోలీసు అధికారులు వెంటనే పరిశీలించి ఈ–డీఏఆర్ పోర్టల్‌లో ఆమోదించాలని సీఎస్ స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో ప్రమాద కేసుల వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు.

ప్రమాద వివరాల నమోదు లేదా పోలీసు ధ్రువీకరణలో జాప్యం కారణంగా బాధితులకు చికిత్స అందడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని తెలిపారు.

ఆసుపత్రులు సమర్పించిన చికిత్స క్లెయిమ్‌లను సంబంధిత పోర్టల్‌లో పరిశీలించి ఆమోదించిన అనంతరం, పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (PFMS) ద్వారా ఆసుపత్రులకు నిధులు విడుదల చేసే ప్రక్రియను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు టీఎంఎస్ యూఎంపీ పేయర్ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను ఎప్పటికప్పుడు పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన ఆమోదాలు అందించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ బాధ్యతల మార్పిడి జరిగినప్పుడు పోర్టల్‌లో సంబంధిత అధికారి వివరాలు, జిల్లా అధికారిక ఈ–మెయిల్, మొబైల్ నంబర్లను వెంటనే నవీకరించాలని తెలిపారు. పథకం అమలులో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్ నియమించిన ఫిర్యాదుల పరిష్కార అధికారి ద్వారా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

రోడ్డు ప్రమాద ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలి.

ప్రతి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని, ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశాల్లో ప్రమాదాల వివరాలు, బాధితులకు అందుతున్న వైద్య సేవలు, పెండింగ్ కేసులు, క్లెయిమ్‌ల ఆమోదం, ఆసుపత్రులకు నిధుల చెల్లింపులపై సమీక్షించాలని సూచించారు.

జాతీయ సమాచార కేంద్రం (ఎన్ఐసీ) జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారిని జిల్లా రోడ్డు భద్రతా కమిటీలో క్రియాశీల సభ్యుడిగా చేర్చి, ఈ–డీఏఆర్, పీఎం రాహత్ పోర్టల్ల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారం పొందాలని తెలిపారు. ఆరోగ్య, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, బాధితులకు చికిత్స పూర్తికాకముందే పథకానికి సంబంధించిన ప్రక్రియల కారణంగా ఆసుపత్రుల నుంచి డిశ్చార్జి చేసే పరిస్థితి రాకుండా చూడాలని స్పష్టం చేశారు.

పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు నెక్ట్స్‌జెన్ ఎం–పరివాహన్ (NextGen mParivahan) మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. ఈ యాప్ ద్వారా రోడ్డు ప్రమాదాల సమాచారం అందించడం, క్లెయిమ్‌ల స్థితిని తెలుసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రతి ప్రమాద కేసును పీఎం రాహత్ పథకం కింద నమోదు చేయాలి -- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులతో మాట్లాడుతూ, జిల్లాలో పీఎం రాహత్ పథకాన్ని తక్షణమే అమలులోకి తీసుకువచ్చి, ప్రమాద కేసులను ఈ పథకం కింద నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాలో జరిగే ప్రతి రోడ్డు ప్రమాద కేసును నమోదు చేసి, అర్హులైన బాధితులకు పథకం ద్వారా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

జిల్లాలోని ప్రతి ఆరోగ్యశ్రీ ఆసుపత్రి పీఎం రాహత్ పథకంలో వెంటనే నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల పూర్తి వివరాలను సేకరించి, సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) వివరాలతో మ్యాపింగ్ చేయాలని సూచించారు. ఆసుపత్రులు, సంబంధిత పోలీసు అధికారుల మధ్య నిరంతర సంప్రదింపులు ఉండేలా చూడాలని, ప్రమాదం జరిగిన వెంటనే కేసు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు.

జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమన్వయంతో పనిచేస్తూ, అన్ని ఆరోగ్యశ్రీ ఆసుపత్రుల నమోదు, పోలీస్ స్టేషన్ అధికారుల వివరాల మ్యాపింగ్, ప్రమాద కేసుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియలను పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి రోడ్డు ప్రమాద కేసుకు సంబంధించి ఆసుపత్రి, పోలీసు శాఖలు వెంటనే స్పందించి అవసరమైన వివరాలను నమోదు చేయడంతో పాటు, ధ్రువీకరణలు, ఆమోదాలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, బాధితులను సకాలంలో ఆసుపత్రులకు తరలించేలా పోలీసు, వైద్య, రవాణా, రహదారులు మరియు భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పీఎం రాహత్ పథకం కింద నమోదైన కేసులు, బాధితులకు అందించిన చికిత్స, పెండింగ్ ఆమోదాలు, ఆసుపత్రులకు చెల్లించాల్సిన నిధులపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు.

అర్హులైన ప్రతి ప్రమాద బాధితుడికి పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని, ఆసుపత్రుల నమోదు లేదా పరిపాలనా ప్రక్రియల కారణంగా అత్యవసర వైద్య చికిత్సలో ఎలాంటి జాప్యం జరగకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి గోపాల రావు, ఆర్‌డబీ ఈఈ, జిల్లా రవాణా అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులకు అండగా నిలిచిన రాబిన్ హుడ్ ఆర్మీ హైదరాబాద్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 24 ఏటూరు నాగారం** ములుగు జిల్లా, తెలంగాణ: నిధులులేని స్వచ్ఛంద సేవా సంస్థ అయిన రాబిన్ హుడ్ ఆర్మీ హైదరాబాద్, గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి మరియు సంక్షేమానికి మద్దతుగా తెలంగాణలోని ములుగు జిల్లా, ఏటూరునాగారం పరిసర మారుమూల గిరిజన ప్రాంతాల్లో సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో భాగంగా, గిరిజన సమాజానికి చెందిన డిగ్రీ విద్యార్థులకు ఉన్నత విద్య మరియు డిజిటల్ అభ్యాసానికి తోడ్పడేందుకు 8 ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. అదేవిధంగా, ఏటూరునాగారంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ( కేజీబీవీ)లో చదువుతున్న బాలికలకు రుతుస్రావ పరిశుభ్రత మరియు ఆరోగ్య పరిరక్షణను ప్రోత్సహించే ఉద్దేశంతో 200 శానిటరీ నాప్‌కిన్‌లను పంపిణీ చేశారు.

హైదరాబాద్‌కు చెందిన ఆల్‌షోర్ టెక్నాలజీస్ మరియు జగతి ఫౌండేషన్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజన విద్యార్థులకు విద్యాపరమైన సహాయం మరియు అవసరమైన వనరులను అందించడం ద్వారా వారిని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం.

కార్యక్రమంలోని ముఖ్యమైన సేవా కార్యక్రమాలు

1. గిరిజన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

గిరిజన ప్రాంతాలకు చెందిన డిగ్రీ విద్యార్థులకు డిజిటల్ విద్యా వనరులను అందుబాటులోకి తీసుకురావడం, వారి ఉన్నత విద్యకు తోడ్పడడం మరియు విద్యా ప్రయాణాన్ని మరింత బలోపేతం చేయడం కోసం 8 ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు.

దాత: ఆల్‌షోర్ టెక్నాలజీస్, హైదరాబాద్

పంపిణీ చేసిన ల్యాప్‌టాప్‌ల సంఖ్య: 8

ప్రాంతం: ఏటూరునాగారం

2. శానిటరీ నాప్‌కిన్‌ల పంపిణీ

ఏటూరునాగారంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం లో చదువుతున్న బాలికలకు రుతుస్రావ పరిశుభ్రతను ప్రోత్సహించడం, వారి ఆరోగ్యం మరియు సంక్షేమాన్ని మెరుగుపరచడం కోసం మొత్తం 200 శానిటరీ నాప్‌కిన్‌లను పంపిణీ చేశారు.

దాత: జగతి ఫౌండేషన్, హైదరాబాద్

పంపిణీ చేసినవి: 200 శానిటరీ నాప్‌కిన్‌లు

లబ్ధిదారులు: ఏటూరునాగారం కస్తూరిబాయి బాలికల నివాస పాఠశాల విద్యార్థినులు

సహకారం మరియు పాల్గొన్న ప్రతినిధులు

ఈ సేవా కార్యక్రమానికి ఏటూరునాగారం సూపరింటెండెంట్ (ఖాూ) శ్రీ మానన్ భట్ సీఐ సూర్యప్రకాష్ ప్రత్యేక సహకారం అందించారు.

హైదరాబాద్‌కు చెందిన రాబిన్ హుడ్ ఆర్మీ రూరల్ / ట్రైబల్ కార్యక్రమాల ప్రతినిధులు శ్రీ రమేష్ బూసారపు, శ్రీ కిరణ్ కుమార్ కె. మరియు శ్రీ హర్ష ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అలాగే, ఆల్‌షోర్ టెక్నాలజీస్ ఉద్యోగులు శ్రీ సుకాంత్ కె., శ్రీ ప్రదీప్ పి. మరియు శ్రీ జగదీష్ పి. కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతంగా నిర్వహించడంలో తమ వంతు సహకారం అందించారు.

సామాజిక ప్రభావం -- మా నిబద్ధత

సామాజిక బాధ్యత మరియు నిస్వార్థ సేవా భావంతో రాబిన్ హుడ్ ఆర్మీ హైదరాబాద్, సమాజంలోని అణగారిన మరియు వెనుకబడిన వర్గాలకు చేరువై అర్థవంతమైన సామాజిక ప్రభావాన్ని సృష్టించేందుకు నిరంతరం కృషి చేస్తోంది.

ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా గిరిజన విద్యార్థులను ప్రోత్సహించడం, వారికి మెరుగైన విద్యా అవకాశాలను అందించడం మరియు మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడటం, స్వచ్ఛంద సేవకులు, దాతలు మరియు భాగస్వామ్య సంస్థలు మరింత సమానత్వంతో కూడిన, అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణం కోసం చేస్తున్న సమిష్టి కృషికి నిదర్శనం.

# రేణుకా మాతకు ప్రత్యేక పూజలు

## శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తుల ప్రత్యేక పూజలు



**జహీరాబాద్ అక్టోబర్ 24 ప్రజాబలం ప్రతినిధి:** శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతంలోని జరాసంఘం మండలం బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమంలో కొలువైన శ్రీ రేణుకా మాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక అర్చనలు, కుంకుమ పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, భక్తి నామస్మరణల మధ్య పూజా కార్యక్రమాలు కొనసాగాయి. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, తమ కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం శ్రీ రేణుకా మాతను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీస్సులు పొందారు. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో పూజించడం ద్వారా భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజలతో ఆశ్రమ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. అమ్మవారి కృపతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమాల్లో నందిని మాత, వారి శిష్యులు, ఆశ్రమ భక్తులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి శ్రీ రేణుకా మాత అనుగ్రహాన్ని పొందారు.




Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com